

మళ్లీ కాలువలోకి కారు



గతంలో ఎక్కడైతే ప్రమాదం జరిగిందో మళ్లీ అక్కడే ప్రమాదం జరిగి కారు కాలువలోకి దూసుకుపోయింది.. గత ప్రమాదంలో తల్లీ..ఇద్దరు కుమారులు మృతిచెందగా.. ప్రస్తుత ప్రమాదంలో గాయాలతో బయటపడ్డారు. -7లో



కొవ్వూరులో శుక్రవారం జరిగిన టీడీపీ సమావేశంలో కార్యకర్తల ఆందోళన

కొవ్వూరులో ఫ్లెక్సీ

వలసలసల!

కొవ్వూరులో భగ్గుమంటున్న టీడీపీ నాయకులు

- రాజీవ్‌కృష్ణ చేరికపై అసహనం
- నెల తరువాత ఆందోళన
- ఐదేళ్లు కష్టపడ్డ మా పరిస్థితేంటి?
- ఇటీవల సమావేశంలో గొడవ
- ఇంత వరకూ మౌనానికి కారణం?
- పార్టీ వర్గాల్లో తీవ్ర చర్చ
- అధిష్ఠానం వద్ద నిర్ణయం

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

కొవ్వూరు టీడీపీలో వలసలపై సలసల కాగుతున్నారు. వైసీపీ నాయకులు టీడీపీలో చేరడంపై భగ్గుమంటున్నారు.గత ఐదేళ్ల వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు మమ్మల్ని ఇబ్బందులకు గురిచేసిన నాయకులను ఎలా పార్టీలో చేర్చుకుంటారని మండి పడుతున్నారు. ఇటీవల జరిగిన నియోజకవర్గ టీడీపీ సమావేశంలోనూ స్థానిక నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రముఖ పారిశ్రామికవేత్త పి.కృష్ణబాబు అల్లుడు ఎస్.రాజీవ్‌కృష్ణ అనుచరులతో నవంబరు 14న తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్రమంత్రి నారా లోకేష్ సమక్షంలో తెలుగుదేశం పార్టీ కండువా కప్పుకున్నారు. నాటి నుంచి చిచ్చు రేగింది. కనీస సమాచారం లేకుండా రాజీవ్‌కృష్ణను పార్టీలో చేర్చుకోవడంపై స్థానిక నాయకులు గుర్రుగా ఉన్నారు. గత ఐదేళ్ల నియోజకవర్గంలో ఎన్నో ఇబ్బందులు పడ్డామని.. కేసులు కూడా అనుభవించామని.. ఇప్పుడు ఇలా చేయడం తగదని వాపోతున్నారు. సాధారణంగా ఒక నియోజకవర్గం నుంచి ఇతరులు పార్టీలో చేరేటప్పుడు పార్టీ కూడా అక్కడి పెద్దలు, ఎమ్మెల్యే, ఇతర నేతల అభిప్రాయాలు తీసుకోవడం సాధారణం. ఏమైందో ఏమో కానీ నేరుగా నారా లోకేష్ సమక్షంలోనే రాజధానిలో పార్టీలో చేర్పించుకున్నారు.దీంతో కొవ్వూరు నియోజకవర్గంలో వైసీపీ ఇంచుమించు ఖాళీ అయిపోయింది. రాజీవ్‌కృష్ణ అచ్చిబాబుకు వరసకు అల్లుడు కావడంతో పార్టీ మరింత బలోపేతమవుతుందని అప్పట్లో అధిష్ఠానం భావించింది. కృష్ణబాబు, అచ్చిబాబుల వారసుడిగా రాజీవ్‌కృష్ణ ఇక్కడ బలమైన నేత అవుతారని ప్రచారం జరిగింది. ప్రస్తుతం ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గంగా కొవ్వూరు ఉంది.2029లో జరిగే సార్వత్రిక ఎన్నికల నాటికి నియోజకవర్గాల పునర్విభజన నేపథ్యంలో రిజర్వేషన్లు మారే అవకాశం ఉన్నట్టు అంచనా ఉంది. ఈ నేపథ్యంలో ఎవరి రాజకీయ అంచనాలు, ఆలోచనలు, వ్యూహాలు వారికి ఉంటాయి.

టీడీపీకి రాజీవమా?

ఇటీవల క్రిస్మస్, నూతన సంవత్సర , సంక్రాంతి శుభాకాంక్షలు పేరుతో రాజీవ్‌కృష్ణ ఫొటోతో నియోజకవర్గంలో అనేక చోట్ల హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలు వెలిశాయి. అందులో ఎన్టీఆర్, ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు,డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తదితర నాయకుల ఫొటోలు ఉన్నాయి. ఇటువంటి హోర్డింగ్‌లు,ఫ్లెక్సీలు నియోజకవర్గం అంతా వెలిశాయి.దీంతో శుక్రవారం జరిగిన టీడీపీ సమావేశంలో ఎమ్మెల్యేద్విసభ్య కమిటీ సభ్యుల సమక్షంలో పలువురు కార్యకర్తలు ,కొందరు ద్వితీయ శ్రేణి నాయకులు రాజీవ్‌కృష్ణను పార్టీలో చేర్చుకోవడాన్ని తప్పుబట్టారు.దీంతో కొవ్వూరు నియోజకవర్గంతో పాటు,జిల్లాలో కూడా చర్చనీయాంశమైంది. పార్టీ కష్టకాలంలో ఉన్న సమయంలో పార్టీకి అండగా ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వాలని పలువురు డిమాండ్ చేశారు. రాజీవ్‌కృష పార్టీలో చేరిన సమయంలో ఎవరూ మాట్లాడలేదు. ఇవాళ కొందరు మాట్లాడడం వల్ల అధిష్ఠానం వారి మాటలను ఎలా తీసుకుంటుందోననే చర్చ కూడా జరుగుతోంది. రాజీవ్‌కృష్ణ చేరిక వల్ల పార్టీకి నిస్సందేహంగా మేలు జరుగుతుంది. ఎందుకంటే గత వైసీపీ ప్రభుత్వంలో రాజీవ్‌కృష్ణ ప్రభుత్వ సలహాదారుగా వ్యవహరించారు. వైసీపీ ఓడిపోయిన తర్వాత ఓ సామాజికవర్గం పట్ల వైసీపీ వైఖరిని నిరసిస్తూ ఏకంగా మాజీ సీఎం జగన్‌కు బహిరంగ లేఖ కూడా రాశారు. డైరెక్ట్‌తో జగన్‌తో ఢీ అంటే ఢీ అన్నారు. అటువంటి నాయకుడు టీడీపీలో చేరడం వల్ల నియోజకవర్గంలో పార్టీ బలోపేతమవుతుందనేది పలువురి వాదన. సమస్యలు ఏమైనా ఉంటే పార్టీలో అందరూ కూర్చుని మాట్లాడుకునే అవకాశం ఉంది. లేదా పార్టీనే తలు, ఎమ్మెల్యే ద్వారా లేదా అక్కడ పెద్దగా ఉన్న అచ్చిబాబు ద్వారా అయినా తమ ఇబ్బం దులేమైనా ఉంటే చెప్పుకునే అవకాశమూ లేకపోలేదు. కానీ ఆకస్మికంగా రోడ్డెక్కడం వల్ల పార్టీకి నష్టం జరుగుతుందనే అంచనా ఉంది. కార్యకర్తలు పార్టీని దృష్టిలో పెట్టుకుని ఆలోచించాల్సి ఉంది. ఎస్సీ నియో జకవర్గం కావడంతో ఇప్పటి వరకూ కొవ్వూరు నియోజకవర్గానికి ఎక్కడెక్కడి నుంచో నేతలు వచ్చి పోటీ చేస్తున్నారు. గత ఎన్నికల్లో గోపాలపురం నుంచి వచ్చిన ముప్పిడి వెంక టేశ్వరరావు పోటీ చేసి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. వచ్చే కాలంలో రిజర్వేషన్లు మారే అవకాశం ఉన్నం దు న ఇప్పటి నుంచే నాయకుడిని తయారు చేసేఆలోచనలో అధిష్ఠానం ఉన్నట్టు సమాచారం.

అభివృద్ధికి కొవ్వూరు దూరం..

ఇప్పటి వరకూ కొవ్వూరు నియోజకవర్గంలో అభివృద్ధి కంటే కొందరు నేతలు వ్యక్తిగత లబ్ధికే ప్రాధాన్యత ఇస్తారనే విమర్శ ఉంది. అందుకే గోదావరికి ఒక పక్క ఉన్న రాజమహేంద్రవరం మహానగరంగా విస్తరిస్తుంటే.. గోదావరికి మరో పక్కన ఉన్న కొవ్వూరు అభివృద్ధికి దూరంగా ఉంటుంది. ముఖద్వారాల వద్ద, గోదావరి ఒడ్డున పాడై పోయి ఉన్న పార్కుల చూస్తే కొందరి నేతల మనస్తత్వం అర్థం అవుతుంది. రాజ మహేంద్రవరానికి ధీటుగా కొవ్వూరు ఎదగాలి. ఇవి రెండూ జంట నగరాలుగా ఎదగడానికి అవసరమైన అనేక వనరులు, ఈప్రాంత ప్రాధాన్యతలు ఉన్నాయి.ఇటువంటివి పట్టించుకుంటేనే నాయకులవుతారు. కొవ్వూరులో మాత్రం దీనికి రివర్స్. రాజకీయాల్లో ప్రజల ప్రయోజనాలకన్నా.. వ్యక్తిగత ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇచ్చే ధోరణి ఇటీవల బాగా పెరిగిందనే విమర్శలు ఉన్నాయి. ఇది ఎస్సీ నియోజకవర్గం కావడంతో అక్కడ ఎమ్మెల్యేల అభ్యర్థులను ప్రతి ఎన్నిక ల్లోనూ మార్చేస్తున్నారనే విమర్శ ఉంది. రాజీవ్ కృష్ణను వ్యతిరేకించడంలో కూడా కొంతమంది స్వార్థపూరిత రాజకీయాలు ఉన్నాయనే చర్చ ఉంది. రాజీవ్‌కృష్ణ కూడా అందరినీ కలుపుకుని పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలను,నేతలకు కూడా ప్రాధాన్యత ఇవ్వలసిన అవసరం ఉంది. గతంలోనే ఇక్కడ ఏమైనా సమస్యలుంటే నచ్చ చెప్పి ఎవరి ప్రాధాన్యత వారికి ఇస్తూ పార్టీని ముందుకు నడిచేలా చూడాలని విజయనగరం జిల్లాకు చెందిన ఓ నేతకు బాధ్యత అప్పగించింది.



మూడు రోజులుగా ఎండలేదు.. అల్పపీడనం నేపథ్యంతో రోజంతా మబ్బుగానే ఉంటుంది.. సూరీడు వచ్చినా కనిపించడంలేదు..సూరీడుకి కోపం వచ్చిందో ఏమో ఆదివారం సాయంత్రం రాజమహేంద్రవరం రోడ్ కం రైలు బ్రిడ్జి వద్ద గోదావరిలో ఇలా ఎర్రబడ్డాడు.. తన వెలుగును ప్రసరింపజేసి అస్తమించాడు..ఈ సుందర దృశ్యాన్ని పలువురు సెల్‌ఫోన్లలో బంధించారు. - కొవ్వూరు

సిబ్బంది ఉండరు.. హెల్ప్ చేయరు!

జీజీహెచ్‌లో పేరుకే హెల్ప్‌లైన్



రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరం బోధనాసుపత్రి (జీజీహెచ్)కి నిత్యం వందల సంఖ్యలో రోగులు వస్తుంటారు. వైద్యం కోసం ఎక్కడెక్కడి నుంచో ఇక్కడకు రావడం జరుగుతుంది. ఇక్కడకు వచ్చే వారిలో చదువుకున్నవారికంటే చదువురాని వారు, వయస్సు మళ్లిన వారు ఎక్కువ. ఎంతో దూరం నుంచి వైద్యానికి వచ్చే వారికి ఆసుపత్రిలో ఏ విభాగం ఎక్కడుంటుంది ? ఏ వార్డు ఎక్కడ? ఏ డాక్టర్ ఎక్కడ ఉంటారు ? రక్త పరీక్షలు ఎక్కడ చేస్తారు ? వంటి సమాచారం తెలియదు. కొత్తగా వచ్చేవారికి, చదువుకున్నవారికి కూడా ఈ వివరాలు తెలియవు.అక్కడ పనిచేసే కొద్దిమంది సిబ్బందికి మినహా మిగిలిన వాళ్లు అయోమయపడతారు. ఇక రోగులు, వారి సహాయకులు మరింత గందరగోళానికి గురవుతారు. ఓపీ చీటి పట్టుకుని ఈ నెంబరు గది ఎక్కడుంది, ఈ పరీక్షలు ఎక్కడ చేస్తారు అంటూ అక్కడ కనిపించిన వారందరినీ అడుగుతుంటారు. ఈ క్రమంలో దాదాపు రోగులు తీవ్ర అవస్థలు పాలవుతుంటారు. దీంతో మూడు నెలల కిందట ఆసుపత్రి అధికారులు హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసి జీడీఏ స్థాయి కల్గిన ఒక చిరుద్యోగికి డ్యూటీ వేసి చేతులు దులుపుకున్నారు. ఓపీ కారిడార్‌ను అనుకుని ఏర్పాటు చేసిన ఈ హెల్ప్ డెస్క్ పనితీరుపై రోగులు, వారి సహాయకులు పెదవి విరుస్తున్నారు. హెల్ప్ డెస్క్‌లో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 వరకూ డ్యూటీ చేయాల్సి ఉంటుంది. హెల్ప్ డెస్క్‌లో సమాచారం ఇచ్చేందుకు సిబ్బంది లేకపోవడంతో రోగులు, వారి సహాయకులకు ఎప్పటిలానే ఇక్కట్లు తప్పడం లేదు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో హెల్ప్ డెస్క్‌లో సిబ్బంది విధుల నిర్వహణ తూతూ మంత్రంగా సాగుతున్నదనే ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి.

అందుబాటులో ఎరువులు

వ్యవసాయాధికారి మాధవరావు

రాజమహేంద్రవరం రూరల్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రబీలో రైతులకు కావాల్సిన ఎరువులు అందుబాటులో ఉన్నాయని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు తెలిపారు. దాళ్వాసీజన్‌లో ముఖ్యంగా వరి, ఇతర పంటలకు 1.10 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం ఉందన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో 1961 హెక్టార్లలో వరి నాట్లు వేశారని తెలిపారు. ప్రస్తుతం అన్ని రకాల ఎరువులు కలిసి 22,487 టన్నులు అందుబాటులో ఉన్నాయన్నారు. యూరియా 8,300 టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 7,800 టన్నులు, సూపర్ 2,100 టన్నులు, పొటాష్ 2,100 టన్నులు, డీఏపీ 928 టన్నులు అందుబాటులో ఉన్నట్టు తెలిపారు. సొసైటీలలో 7,800 టన్నులు, ప్రైవేట్ డీలర్స్ వద్ద 10,600 , మార్క్‌ఫెడ్‌లో 327 , డీసీఎంఎస్‌లో 1500, హోల్‌సేల్‌లో 900 పైచిలుకు రైతులకు అందుబాటులో ఉన్నాయన్నారు.



అనపర్తిలో డ్రోన్ కెమెరాలపై శిక్షణ

నేరగాళ్లపై.. మరో నేత్రం

అనపర్తి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : నేరగాళ్ల పసిగట్టే పనిలో పోలీసులు ఉన్నారు..నిఘా వ్యవస్థను మరింత పటిష్టం చేయనున్నారు.. నిన్నటి వరకూ ఎక్కడైనా చోరీ జరిగినా.. హత్య జరిగినా సీసీ కెమెరాలే ఆధారం.. సీసీ కెమెరాలో ఆధారం దొరక్కపోతే అంతే.. సీసీ కెమెరాలు ఎన్నో కేసులను ఛేదించిన ఘటనలు ఉన్నాయి. అయితే ప్రస్తుతం నేరాల సంఖ్య పెరిగింది. ఈ నేపథ్యంలో పోలీసులు ఆధునికతవైపు చూస్తున్నారు. దీనిలో భాగంగా పోలీసులు మరో కొత్త విధానానికి శ్రీకారం చుట్టబోతున్నారు. దీనిలో భాగంగా ఇప్పటికే పోలీసులకు శిక్షణ ఇస్తున్నారు.. త్వరలో ప్రతి పోలీస్‌స్టేషన్‌కు డ్రోన్ కెమెరాలను అందించనున్నారు. పట్టణాలకే పరిమితమైన డ్రోన్ వినియోగం పల్లెల్లోని పోలీసులకు అందుబాటులోకి తీసుకురానున్నారు.అనపర్తిలో పోలీసు సిబ్బందికి ఆదివారం డ్రోన్ కెమెరాల వినియోగంపై ప్రత్యేక శిక్షణ అందించారు.ఎస్ఐ శ్రీను నాయక్ మాట్లాడుతూ డ్రోన్ కెమెరాలతో నేరాల అదుపు సులభతరం మవుతుందన్నారు.

రావులపాలెంలో కబడ్డీ పోటీలు ప్రారంభం
ధర్మవరంలో ఎలక్ట్రికల్ బైక్ దగ్ధం
7



భూ..మాయ!

కన్నుపడిందా ఖాళీ ఆక్రమించేస్తున్నారు.. పత్రాలు మార్చి వేరొకరికి విక్రయించేస్తున్నారు .. జిల్లాలో ఇటువంటి ఘటనలు యథేచ్ఛగా సాగుతున్నాయి.. అధికారుల పర్యవేక్షణ కొరవడి భూబకాసురుల ధాటికి బలైపోతున్నారు..తాజాగా రాజానగరం మండలం చక్రద్వారబంధం.. తాళ్ళపూడి మండలం తిరుగుడుమెట్టలో జరిగిన ఘటనలే నిదర్శనం.

- యథేచ్ఛగా భూముల అక్రమ రిజిస్ట్రేషన్లు
- ఎకరా రూ. కోటి భూమి రూ.30 లక్షలకే
- చక్రద్వారబంధంలో అడ్డుకున్న గ్రామస్తులు
- తిరుగుడుమెట్ట భూమిదీ అదే పరిస్థితి
- పోలీస్ స్టేషన్లలో కేసులు



చక్రద్వారబంధంలో భూమి వద్ద గొడవ

రాజానగరం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : భూముల ధరలకు రెక్కలు రావడంతో అక్రమార్కులు కొంత మంది రాత్రికి రాత్రే నకిలీ దస్తావేజులు, దొంగ వీలునామాలు సృష్టించి భూయజమానుల కళ్లు కప్పి భూముల క్రయ విక్రయాలకు పాల్పడుతున్నారు. దీనిని నిరోధించాల్సిన కొంత మంది అధికారులు అక్రమార్కులకు దాసోహమై అందిన కాడికి దండుకుని రికార్డులు తారుమారు చేసేస్తున్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజానగరం మండలం చక్రద్వారబంధం, తాళ్ళపూడి మండలం తిరుగుడుమెట్టలో ఘటనలే అందుకు నిదర్శ నం. చక్రధ్వారబంధం గ్రామంలో సర్వే నెంబరు 688-1బి; 689-1; 690, 691-6 వెరసి ఎకరాలు 5.587 సెంట్లు భూమి కొమ్మురెడ్డి లక్ష్మీనరసింహం పేరుతో దఖలు పడి ఉంది.ఈ భూమి మామిడి, జీడి మామిడి, సీతాఫలం వృక్షాలతో నిండి ఉంటుంది. సదరు పొలాన్ని గ్రామానికి చెందిన పేపకాయల పోతురాజు గత మూడు దశాబ్దాలుగా కౌలుకు సాగుచేస్తూ వస్తున్నారు. సంబంధిత భూయజమాని గతించిపోవడం, వారసు లకు ఇక్కడ భూమి ఉందన్న విషయం తెలియక పోవడంతో కౌలు రైతు పోతురాజు అధీనంలోనే ఉండి పోయింది. సదరు భూమికి వారసులు ఎవరో తెలియక పోవడంతో దీనిపై కన్నేసిన కొంతమంది స్థానిక వైసీపీ నాయకులు ఇటీవల వైసీపీ మండల ప్రజాప్రతినిధి సహకారంతో సదరు భూమిని విక్రయించేందుకు ఉప క్రమించారు. దీంతో గత కొంతకాలంగా గ్రామంలో వివాదం నెలకొంది.ప్రస్తుత మార్కెట్ విలువ ఎకరం రూ.కోటి వరకు ధర పలుకుతుంది. అయితే సదరు వైసీపీ నాయకులు మాత్రం కారు చౌకగా ఎకరా రూ.30 లక్షలు వంతున విక్రయించినట్లుగా గ్రామంలో చర్చసాగుతోంది. దీంతో ఇంకాస్త ముందడుగు వేసిన అక్రమార్కులు గత రెండు రోజులుగా సదరు పొలంలో ఉన్న చెట్లను తొలగించే పనులు చేపట్టారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు కొంతమంది ఆదివారం పొలంలోకి వెళ్లి పనులను అడ్డుకున్నారు.అప్పటికే చెట్లను తరలించేందుకు సిద్ధంగా ఉన్న ట్రాక్టర్‌ను అడ్డుకున్నా రు.నరికిన వృక్షాలను తరలిస్తే ఊరుకోబోమని చెప్పడం తో అక్కడే వదిలిపెట్టి చేసేది లేక సంఘటనా స్థలం నుంచి వెనుతిరిగారు. సదరు భూముల క్రయవిక్రయాల్లో జనసేనకు సంబంధించిన వాళ్లు కూడా భాగస్వాములుగా ఉన్నారని చెప్పడంతో ఒక దశలో ఘర్షణ వాతావరణం నెలకొంది. విషయం తెలుసుకున్న పోలీ సులు సంఘటనా స్థలా నికి చేరుకుని ఇరువర్గాలకు సర్దిచెప్పి అక్కడి నుంచి పంపించేశారు.అనంతరం భూముల విక్రయాన్ని వ్యతిరే కిస్తున్న గ్రామస్తులు కొంతమంది నన్నయ వర్శిటీ సమావేశంలో ఉన్న ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణను కలిసి వివరాలు వెల్లడించారు. దీనిపై ఎమ్మెల్యే స్పం దిస్తూ సదరు భూమికి సంబంధించి సక్రమమైన రికార్డుల్లేకుండా నకిలీ దస్తావేజులు సృష్టించి విక్ర యాలు సాగిస్తే చర్యలు తీసుకుంటామని గ్రామస్తు లకు హామీ ఇచ్చారు.ఈ విషయంలో ఏవిధమైన వివాదాలకు తావులేకుండా ఉండేలా అవసరమైన సహాయ సహకారాలు అందించే దిశగా చూడాలని చెంతనే ఉన్న సీఐ ప్రసన్న వీరయ్య గౌడ్‌ను ఎమ్మెల్యే సూచించారు.

తిరుగుడుమెట్టలో పొలం.. తాడేపల్లిగూడెంలో అక్రమ రిజిస్ట్రేషన్

తాళ్లపూడి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) తమ పేర మీద గల భూమి మరొకరి పేర అక్రమంగా రిజిస్ట్రేషన్ జరిగిన సంఘటనపై తాళ్లపూడి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మండలంలోని తిరుగుడుమెట్ట గ్రామానికి చెందిన రెబ్బాప్రగడ సాయి కృష్ణకు వంశపారంపర్యంగా గ్రామంలోని 202 సర్వే నెంబరులో య 0.93 సెంట్ల భూమి ఉంది. రెవెన్యూ రికార్డులు పరిశీలించుకునే తరుణంలో తమ పేరున ఉండాల్సిన భూమి ఏలూరు జిల్లా పోలవరం మండలం టేకూరు గ్రామానికి చెందిన చోడిశెట్టి శ్రీనివాసరావు పేర ఉండడంతో హతాశులయ్యారు.వేగేశ్వరపురం సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్‌లో నకలు చూడగా తాడేపల్లిగూడెం రిజిస్ట్రార్ కార్యాలయంలో అక్రమంగా వేరొకరిపేర రిజి స్ట్రేషన్ జరిగినట్టు గ్రహించి తాళ్లపూడి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్ఐరామకృష్ణ కేసు నమోదు చేశారు.

క్రీడారంగం అభివృద్ధికి చర్యలు

రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ రవినాయుడు



ఎమ్మెల్యే గోరంట్లతో శాప్ చైర్మన్ రవినాయుడు

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో క్రీడారంగం అభివృద్ధికి సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని, ఈ క్రమంలో దేశంలోనే అత్యుత్తమంగా ఏపీ స్పోర్ట్సు పాలసీని రూపొందించామని రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) చైర్మన్ ఏ.రవినాయుడు అన్నారు. రాజమహేంద్రవరంలో ఆదివారం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరిని కలసి నాగులాచెరువులోని క్రీడా వికాస కేంద్రాన్ని సందర్శించారు. అసంపూర్తిగా నిలిచిన క్రీడా వికాస కేంద్రాన్ని పరిశీలించి నిర్మాణ పనులపై జిల్లా స్పోర్ట్సు అథారిటీ అధికారులు, ఇంజనీరింగ్ అధికారులతో ఆరా తీశారు. నిర్మాణ పనులు నిలిచిపోవడానికి కారణాలు తెలుసుకున్నారు. వెంటనే పనులు ప్రారంభించాలని ఆదేశించారు. 2027లో అమరావతిలో జాతీయస్థాయి క్రీడా పోటీలు నిర్వహించేందుకు సీఎం ప్రణాళికలు రూపొందిస్తున్నారని వెల్లడించారు. స్కూల్ స్థాయి నుంచే క్రీడల్లో రాణించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదని ఆ దిశగా స్కూల్స్‌లో గ్రౌండ్సు ఏర్పాటుకు ప్రభుత్వం జీఓ జారీ చేసిందన్నారు. రూరల్ ఎమ్మెల్యే బుచ్చయ్యచౌదరి మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం క్రీడారంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేయడంతో గ్రౌండులో పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయన్నారు.

గుర్కాలు వేసుకుని వచ్చి.. బంగారం దోచుకుపోయారు

పట్టపగలే జ్యూయలరీ షాపులో ముగ్గురు మహిళల చోరీ

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): బంగారు వస్తువులు కొనుగోలు చేస్తున్నట్టుగా నటించిన ముగ్గురు మాయలేడీలు జ్యువెలరీ నిర్వాహకుడికి మస్కా కొట్టి 80 గ్రాములు బంగారువస్తువులు అపహరించుకుపోయిన సంఘటన రాజమహేంద్రవరం గుండు వారి వీధిలో ఆదివారం చోటు చేసుకుంది. వన్‌టౌన్ పోలీసుల కథనం ప్రకారం. రాజమహేంద్రవరం గుండువారిలో ఉన్న వెంకట సాయి జ్యువెలరీ షాపునకు ఆదివారం గుర్కాలు ధరించిన ముగ్గురు మహిళలు వచ్చారు. తమకు బంగారు ఉంగరాలు ,చెవిదిద్దులు వంటి వస్తువులు కావాలని చెప్పడంతో షాపులో ఉన్న వారు చూపించారు.కొద్ది సేపు చూసిన మహిళలు డిజైన్లు బాగోలేదని వెళ్లిపోయారు. కొంతసేపటి తరువాత షాపులో ఉన్న వ్యక్తికి షోకేసులో ఉన్న బంగారు వస్తువులు తక్కువగా ఉన్నట్లు అనిపించి వాటిని బయటకు తీసి చూశాడు. దీంతో బంగారు వస్తువులు 80 గ్రాముల వరకు తగ్గాయి.సీసీ ఫుటేజీని పరిశీలిస్తే గుర్కా ముసుగులో వచ్చిన ముగ్గురు మహిళలు గోల్డ్‌ను అపహరించుకుపోయినట్టు గుర్తించారు. షాపు యజమాని శ్రీనితిన్ ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.సీసీ ఫుటేజీని స్వాధీనం చేసుకున్నారు.

క్రీడలకు ప్రభుత్వం పెద్దపీట

- శాప్ ఛైర్మన్ రవినాయుడు
- 'నన్నయ'లో క్రీడా నిర్మాణాల పరిశీలన


సమావేశంలో మాట్లాడుతున్న శాప్ ఛైర్మన్ రవినాయుడు, చిత్రంలో ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, వీసీ శ్రీనివాసరావు

దివాన్‌చెరువు, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): భారత జాతీయ పతాకాన్ని, ఆంధ్రప్రదేశ్ ఖ్యాతిని ప్రపంచ దేశాల్లో చాటి చెప్పాలనే ఉద్దేశంతో లోటుబడ్జెట్‌లో ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేస్తోందని రాష్ట్ర క్రీడాసాధికార సంస్థ (శాప్) ఛైర్మన్ అనిమిని రవినాయుడు అన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో ఖేలో ఇండియా నిధులతో నిర్మిస్తున్న మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం, స్విమ్మింగ్ పూల్ పనులను ఆయన, స్థానిక ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణతో కలసి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యాశాఖా మంత్రి ఆదేశాల మేరకు పాఠశాలల్లో క్రీడామైదానం ఖచ్చితంగా ఉండాలన్నారు. నన్నయ విశ్వవిద్యాలయంలో జరగాల్సిన పనులు అనుకున్న సమయానికి జరగలేదని, కాంట్రాక్టర్ ఉదాసీనంగా వ్యవహరిస్తూ పనులు జాప్యం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రభుత్వానికి క్రీడాకారుల భవిష్యత్ ఎంతో ముఖ్యమైనదని దానికి తగినట్టుగా జవాబుదారీతనంతో వ్యవహరిస్తున్నామని చెప్పారు. గతంలో విశ్వవిద్యాలయంపై ఎన్నో అభియోగాలు వచ్చినప్పటికీ ప్రస్తుత వీసీ శ్రీనివాసరావు నాయకత్వంలో వాటిని సరిదిద్దే ప్రయత్నం చేస్తున్నామన్నారు. పనుల నిర్మాణాలను పరిశీలించామని ఎట్టి పరిస్థితుల్లోనూ వచ్చే ఏడాది మార్చి నెలాఖరుకు ఇండోర్‌స్టేడియం, స్విమ్మింగ్ పూల్ పనులు పూర్తి కావాలన్నారు. నన్నయ విశ్వవిద్యాలయంలో జాతీయ క్రీడలు నిర్వహించే స్థాయికి ఇక్కడ వసతులు సమకూర్చాలని ఆదేశించారు. తాము ఆదేశించిన సమయానికి సనులు పూర్తికాకపోతే చర్యలు తీసుకుంటామని చెప్పారు. కాంట్రాక్టర్‌ను బ్లాక్ లిస్ట్‌లో పెడతామని రవినాయుడు తెలిపారు. గతంలో 2016లో చంద్రబాబు రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసిన క్రీడా వికాస కేంద్రాలను కనుమరుగు చేశారని ఆరోపించారు. వాటిపై దృష్టి సారిస్తామన్నారు. జాతీయ క్రీడలకు రాష్ట్రంలోని క్రీడాకారులంతా సంసిద్ధంగా ఉండాలని కోరారు. అందుకు శాప్ పూర్తి సహాయసహకారాలు అందిస్తామని శాప్ ఛైర్మన్ చెప్పారు. నన్నయ విశ్వవిద్యాలయంలో సింథటిక్ ట్రాక్ ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలు వచ్చాయని వాటిని పరిశీలించి ఆమోదించేందుకు ప్రయత్నిస్తామన్నారు. పాఠశాలల నుంచి క్రీడలను ప్రోత్సహించేందుకు కార్యాచరణలు రూపొందిస్తున్న నేపథ్యంలో విశ్వవిద్యాలయంలో క్రీడావసరులు ఇంకా పటిష్టంగా ఉండాలన్నారు. దీనికి భిన్నంగా గత ప్రభుత్వ వైఖరి కారణంగా విశ్వవిద్యాలయాల్లో క్రీడావసతులు లేకుండా పోయాయన్నారు. రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ ఖేలె నిధులతో నిర్మిస్తున్న పనులు సకాలంలో పూర్తి కాకపోవడంతో సీఎం, హెచ్‌ఆర్‌డీ మంత్రుల దృష్టిలో ఉన్న అంశాన్ని పరిశీలించేందుకు శాప్ ఛైర్మన్ వచ్చి ఇక్కడ పనులు పరిశీలించారన్నారు. విజయవాడలో 50 మీటర్లు స్విమ్మింగ్ పూల్ నన్నయ విశ్వవిద్యాలయంలో రావడం ఆనందకరమని చెప్పారు. మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం, స్విమ్మింగ్ పూల్ నిర్మాణ పనులు ప్రతిరోజూ మోనటరింగ్ చేయాలని సూచించారు. శాప్ ఛైర్మన్ ఆదేశించిన తేదీలోపు నిర్మాణ పనులు నాణ్యతతో పూర్తిచేయాలని లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామన్నారు. వీసీ ఆచార్య శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇటీవల విశ్వవిద్యాలయంలో రాజకీయపరమైన ఒత్తిళ్లు లేకుండా చక్కని పరిపాలన అందించేందుకు అవకాశం దక్కిందన్నారు. శాప్ ఛైర్మన్ ఆదేశించిన తేదీలోపు నిర్మాణాలు పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ఆచార్య కేవీ స్వామి, డిప్యూటీ రిజిస్ట్రార్ ఎస్.లింగారెడ్డి, విశ్వవిద్యాలయం ఇంజనీర్ కె.నూకరత్నం, విద్యాకళాశాల ఛైర్మన్ కె.సుబ్బారావు, శాప్ అధికార్లు, ఇంజనీర్లు, నాయకులు, పీడీలు పాల్గొన్నారు.

మురిపించిన మంచు సోయగం



మోతుగూడెం, డిసెంబరు22 (ఆంధ్రజ్యోతి): చింతూరు మండలం మోతుగూడెం పరిధిలో ఉన్న చదలవాడ పంచాయతీ తులసిపాక వ్యూ పాయింట్ వద్ద మంచు అందాలు కనువిందు చేస్తున్నాయి. ఇక్కడి వాతావరణాన్ని ఆస్వాదించేందుకు దూర ప్రాంతాల నుంచి పర్యాటకులు తరలివస్తున్నారు.కనిష్ఠ ఉష్ణోగ్రతల నమోదువుతూ ఉండటంతో వృద్ధులు, చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు



ధర్మవరంలో ఎలక్ట్రికల్ బైక్ దగ్ధం


మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

ప్రత్తిపాడు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ధర్మవరంలో ఆదివారం ఎలక్ట్రికల్ బైక్ దగ్ధమైంది. గ్రామంలోని బ్యాంక్ సమీపంలో గొల్లప్రోలు మండలం దుర్గాడ గ్రామానికి దేవరపల్లి సత్యనారాయణ బైక్‌కు ఒక్కసారిగా పొగలు వ్యాపించాయి. దీంతో బ్యాంకు సమీపంలో దానిని నిలిపి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. పొగలు కమ్మిన బైక్‌ను ఫైర్ సిబ్బంది మంటలు ఆర్పారు. రూ.1.20లక్షలతో కొనుగోలు చేసిన ఎలక్ట్రికల్ బైక్ దగ్ధం కావడంపట్ల బైక్ యజమాని కంపెనీకి సమాచారం అందించారు.

అక్రమంగా తరలిస్తున్న 32 పశువులు స్వాధీనం

గొల్లప్రోలురూరల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న పశువులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గొల్లప్రోలు మండలం చెందుర్తి వద్ద జాతీయరహదారిపై ఆదివారం తెల్లవారుజామున వ్యాన్‌లో పశువులు తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో ఎస్ఐ రామకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. విశాఖ నుంచి రాజమహేంద్రవరం వెళుతున్న వ్యాన్‌లో ఉన్న 32 పశువులను స్వాధీనం చేసుకుని, ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశారు.

క్రీడలతో అంతర్జాతీయ ఖ్యాతి

- మంత్రి రాంప్రసాద్‌రెడ్డి
- అట్టహాసంగా ప్రారంభమైన రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు
- క్రీడలపట్ల సీఆర్సీ చూపుతున్న ఆశక్తి అభినందనీయం
- 13 జిల్లాల నుంచి 26 జట్ల క్రీడాకారుల రాక

రావులపాలెం, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు వారు రాణించే క్రీడల్లో చూపించే ప్రతిభాపాటవాలతో అంతర్జాతీయ ఖ్యాతి లభిస్తుందని రాష్ట్ర రవాణా, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. ఆంధ్రా కబడ్డీ అసోషియేషన్ రావులపాలెం సీఆర్సీ సంయుక్త ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం సీఆర్సీ ఆవరణలో 50వ రాష్ట్రస్థాయి బాలుర, బాలికల కబడ్డీ చాంపియన్ షిప్ పోటీలు ఆదివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పొలిట్ బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యం, రాష్ట్ర తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ, ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు గొలుగూరి వెంకటరెడ్డి, కార్యదర్శి యలమంచిలి శ్రీకాంత్, సీఆర్సీ అధ్యక్షుడు తాడి నాగమోహన్ రెడ్డి, కార్యదర్శి కర్రి అశోక్‌రెడ్డితో కలిసి జ్యోతి ప్రజల్వన చేసి క్రీడాపోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం క్రీడాకారుల అభ్యున్నతికి ఎంతగానో కృషిచేస్తుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు క్రీడలకు పెద్దపీట వేశారన్నారు. క్రీడాకారుల ఉద్యోగాల అవకాశాలలో 2 శాతం ఉన్న రిజర్వేషన్లు 3 శాతం పెంచి క్రీడాకారుల పట్ల మక్కువను చాటుకున్నారన్నారు. భవిష్యత్ రాష్ట్రంలో ఉన్న క్రీడాకారులను నేషనల్, ఇంటర్నేషనల్‌స్థాయికి ప్రోత్సహించేందుకు అన్ని విధాలా కూటమి ప్రభుత్వం కృషిచేస్తుందన్నారు. ప్రభుత్వమే కాకుండా రావులపాలెం సీఆర్సీ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు సొంత ఖర్చులతో క్రీడలను నిర్వహించడం అభినందనీయమన్నారు. ఎమ్మెల్యే బండారు సత్యానందరావు మాట్లాడుతూ క్రీడాకారుల వసతుల కల్పనకు కూటమి ప్రభుత్వం కృషిచేస్తుందన్నారు. గ్రామీణస్థాయి క్రీడాకారులకు అంతర్జాతీయస్థాయి గుర్తింపు వచ్చే విధంగా సీఎం చంద్రబాబు చర్యలు తీసుకుంటున్నారన్నారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు సీఆర్సీ చేస్తున్న కృషి, సేవ అభినందనీయమన్నారు. అనంతరం మంత్రి ప్రజాప్రతినిధులతో కలిసి క్రీడాకారులను పరిచయం చేసుకుని మ్యాచ్‌ను ప్రారంభించారు. ఉమ్మడి 13 జిల్లాల నుండి 26 జట్ల క్రీడాకారులను కబడ్డీ పోటీల్లో తలబడేందుకు సిద్ధమయ్యారు. 13 బాలురు విభాగం కాగా, 13 బాలికల విభాగం. అనంతరం పలు జట్లు మ్యాచ్‌ను ప్రారంభించి పోటీల్లో తలబడ్డారు. ఇక్కడ జరిగే బాలుర, బాలికల విభాగంలో లీగ్ అండ్ నాకౌట్ పద్ధతిలో జట్లు తలపడతాయన్నారు. ఈరోజు జరిగిన మూడు మ్యాచ్‌ల్లో ఈస్ట్‌గోదావరి-విశాఖపట్నం తలపడగా ఆరు పాయింట్లతో ఈస్ట్‌గోదావరి గెలిచింది. ప్రకాశం-విజయనగరం తలపడగా 22పాయింట్లతో విజయనగరం గెలిచింది. శ్రీకాకుళం-కర్నూలు తలపడగా 19 పాయింట్లతో శ్రీకాకుళం విజయం సాధించింది. కార్యక్రమంలో స్పోర్ట్స్ డైరెక్టర్ వీరరాఘవరెడ్డి, చిన్నం తేజారెడ్డి, నందం వీరవెంకట సత్యనారాయణ, గుత్తుల పట్టాభిరామారావు, కంఠంశెట్టి శ్రీనివాస్, సత్తి రామకృష్ణారెడ్డి, సూర్య తదితరలు పాల్గొన్నారు.


రావులపాలెం సీఆర్సీలో జ్యోతిప్రజ్వలన చేసి క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, కబడ్డీ పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

సముద్ర జలాల్లో

మత్స్య జాతుల వృద్ధికి కార్యాచరణ

- మత్స్యశాఖ కమిషనర్ డోలాశంకర్ వెల్లడి

కాకినాడ సిటీ, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): సముద్ర జలాల్లో మత్స్యజాతుల వృద్ధికి ప్రభుత్వం కార్యాచరణ చేపట్టిందని రాష్ట్ర మత్స్యశాఖ కమిషనర్ టి.డోలాశంకర్ వెల్లడించారు. స్వర్ణాంధ్ర-2047 విజన్‌లో భాగంగా ఆదివారం కాకినాడ సమీపంలోని హోప్ ఐలాండ్, పరిసర ప్రాంతాలను కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, మత్స్యశాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా హోప్ ఐలాండ్ పరిసర ప్రాంత సముద్ర జలాల్లో సముద్రపు నాచు మొక్కల పెంపకం, తీరం వెంబడి సముద్ర కేజ్‌కల్చర్ యూనిట్స్‌లో అనుగుణమైన మత్స్యజాతుల పెంపకానికి అనుకూలమైన స్థలాలను పరిశీలించారు. అనంతరం మత్స్యశాఖ కమిషనర్ డోలాశంకర్ మీడియాతో మాట్లాడుతూ సముద్ర జలాల్లో రాఫ్ట్ కల్చర్ పద్ధతి లో సముద్రపు నాచు మొక్కలు పెంచు తామన్నారు. తీరం వెంబడి స్థలాల్లో సముద్ర కేజ్ కల్చర్ యూనిట్స్‌లో మత్స్యజాతుల పెంపకం చేపడతామన్నారు. త్వరలో దీనిపై సమగ్ర నివేదికను ప్రతిపాదనల రూపంలో తయరు చేసి ప్రభుత్వానికి సమర్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు బలసాడి రంగారావు, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పంతాడి రాజు, కాకినాడ బోటు ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సంగాడి నాగేశ్వరరావు, ఫిషరీస్ మెరైన్ జేడీ పి.సురేష్, ఆక్వా జేడీ ఎండీ లాల్ మహమ్మద్, ఎస్ఐఎఫ్‌టీ ప్రిన్సిపాల్ ప్రిన్సిపాల్ టి.సుమలత, జిల్లా మత్స్యశాఖ అధికారి కె.కరుణాకర్, ఫిషరీస్ ఏడీ, ఎస్ఐఎఫ్‌టీ ఎడీవో హోప్ ఐలాండ్‌ను సందర్శించారు.


హోప్ ఐలాండ్, పరిసర ప్రాంతాలను పరిశీలిస్తున్న మత్స్యశాఖ కమిషనర్ డోలాశంకర్, ఎమ్మెల్యే కొండబాబు


పాపికొండలుకు వెళుతున్న పర్యాటక బోట్లు

పాపికొండలుకు తొమ్మిది బోట్లు

- విహారయాత్రకు పర్యాటకుల సందడి

దేవీపట్నం, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): పాపికొండలు విహారయాత్రకు రాష్ట్రాల నలుమూలల నుంచి పర్యాటకులు పోటెత్తారు. తొలుతగా మాతృశ్రీ గండిపోశమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొమ్మిది బోట్లలో సుమారు 600మంది పర్యాటకులు మండల పరిధిలో ఉన్న పోశమ్మగండి బోటు పాయింట్ నుంచి గోదావరి పరీవాహక ముంపు ప్రాంతాలైన పూడిపల్లి, తొయ్యేరు, దేవీపట్నం, అగ్రహారం, మూలపాడు, మంటూరు, కొండమొదలు తదితర గ్రామాల మీదుగా పాపికొండలు నుంచి పేరంటాలపల్లి వెళ్లి సందడి చేశారు. అనంతరం తిరిగి సాయంత్రం 5గంటలకు పోశమ్మగండి చేరుకున్నారు.

పేరంటాలపల్లి వెళ్లిన 16 బోట్లు

వరరామచంద్రాపురం: పాపికొండలు, పేరంటాలపల్లి విహారయాత్ర ప్రకృతి అందాలను తిలకించేందుకు ఆదివారం 16 బోట్లు వెళ్లాయి. శని, ఆదివారాలు సెలవు రోజులు కావడంతో పర్యాటకులు దాదాపుగా 1200 వందల మందికి పైగానే విహారయాత్రకు పర్యాటకులు రావడంతో పోచవరం పెర్రి పాయింట్ దగ్గర, పేరంటాలపల్లి మునిమఠం (శివాలయం) ప్రదేశాలలో పర్యాటకులతో సందడి వాతావరణం ఏర్పడింది. దీంతో ఆ ప్రాంతాలలోని కొండరెడ్లు వెదురుతో తయారుచేసిన అల్లికలను పర్యాటకులను ఆకర్షించడంతో వారి వద్ద నుంచి కొనడంతో ఆప్రాంత కొండరెడ్లకు కొంతవరకు ఉపాధి చేకూరుతుంది.

డాక్టర్ శ్రీనివాస్ సంపాదకీయాలు, రచనలు..

సమాజాన్ని చైతన్యం చేశాయి

- సీనియర్ సంపాదకులు డాక్టర్ శ్రీనివాస్‌తో గెట్‌టుగెదర్‌లో వక్తలు


కార్యక్రమంలో మాట్లాడుతున్న సీనియర్ సంపాదకులు కె.శ్రీనివాస్.. (ఇన్‌సెట్‌లో) శ్రీనివాస్ దంపతులను సత్కరిస్తున్న సిబ్బంది

రాజమహేంద్రవరంసిటీ, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): సీనియర్ సంపాదకులు డాక్టర్ శ్రీనివాస్ సంపాదకీయాలు, రచనలు సమాజాన్ని చైతన్యం చేశాయని పలువురు వక్తలు అన్నారు. తూర్పుగోదావరిజిల్లాలోని రాజమహేంద్రవరం జేఎన్ రోడ్డు ఏకేసీ రోటరీ రివర్ సిటీ హాలులో ఆదివారం డాక్టర్ శ్రీనివాస్‌తో ఏపీయూడబ్ల్యూజే, ది రాజమండ్రి ప్రెస్‌క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో 'సమయం.. సందర్భం' పేరిట గెట్ టు గెదర్ కార్యక్రమం సీనియర్ పాత్రికేయులు వీఎస్ఎస్ కృష్ణకుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి మండెల శ్రీరామ్మూర్తి, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు కుడుపూడి పార్థసారథి అహ్వానితులను వేదికపైకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి,మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు,మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, ప్రముఖ న్యాయవాది ముప్పాళ్ల సుబ్బారావు, సీసీసీ ఎండీ పంతం కొండలరావు, ప్రముఖ మానసిక వైద్యులు కర్రి రామారెడ్డి, గుడా మాజీ ఛైర్మన్ గన్నికృష్ణ, రచయితలు అద్దేపల్లి ప్రభు, మారిశెట్టి జితేంద్ర, ముక్కామల చక్రధర్, టీడీపీ నేత యర్రా వేణుగోపాలరాయుడు, దేశిరెడ్డి బలరామనాయుడు, చాంబర్ పూర్వపు అధ్యక్షుడు అశోక్‌కుమార్ జైన్, సాహితీవేత్త యర్రాప్రగడ రామకృష్ణ, అయ్యలగోపి, సన్నిధానంశాస్త్రి, రాకా కార్యదర్శి జీవీ రమణ, ఆంధ్రజ్యోతి బీఎం ఎస్.శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సీనియర్ సంపాదకులు డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో మీడియా విస్తృతి, విలేకరులు, సోషల్‌మీడియా పెరగడం వంటి పరిణామాలు ప్రజాస్వామ్యానికి మంచిదేనన్నారు. జర్నలిజంలోకి కొత్తగా వస్తున్నవారిలో చాలా ధైర్యంగా రాసేవాళ్లు ఉన్నారన్నారు. రాజమహేంద్రవరంతోను, గోదావరితోను, వీరేశలింగం పంతుల తోటతోను తనకున్న అనుబంధాలను గుర్తుచేసుకున్నారు. తొలుత రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి మాట్లాడుతూ ఆంధ్రజ్యోతి పత్రిక నిబద్ధతతో తన పంథాను కొనసాగిస్తోందని, సాహిత్యానికి కూడా పెద్దపీట వేస్తోందన్నారు. సంపాదకులుగా పనిచేసిన డాక్టర్ శ్రీనివాస్ తన ప్రస్థానం కొనసాగించాలన్నారు. మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ మాట్లాడుతూ ఐడియాలజీ, ఫిలాసఫీతో నడిపే పత్రికల్లో ఆంధ్రజ్యోతి ఒకటని, అటువంటి పత్రికలో సిద్ధాంతబద్ధంగా పనిచేస్తూ ప్రభుత్వాలను నిలదీసే సంపాదకీయాలు రాసిన డాక్టర్ శ్రీనివాస్ విలువలకు పెద్దపీట వేశారని కొనియాడారు. ఉభయ గోదావరి జిల్లాల పాత్రికేయులు కలిసి ఆంధ్రజ్యోతి పక్షాన డాక్టర్ శ్రీనివాస్‌ను గజమాలతో, శాలువాలతో సత్కరించారు. ఏపీయూడబ్ల్యూజే, ది రాజమండ్రి ప్రెస్‌క్లబ్ పక్షాన జ్ఞాపికలను శ్రీరామ్మూర్తి, కుడుపూడి పార్థసారథి అందించారు.

రత్నగిరికి పోటెత్తిన భక్తులు


స్వామివారి దర్శనానికి క్యూలైన్లలో భక్తులు

అన్నవరం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధి ఆదివారం సెలవుదినం కావడంతో అశేష భక్తజనంతో పోటెత్తింది. స్వామివారి ప్రత్యేక దర్శనానికి రెండుగంటలు, ఉచిత దర్శనానికి మూడుగంటల సమయం భక్తులు క్యూలైన్‌లో వేచియుండాల్సి వచ్చింది. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ఏఈవో కొండలరావు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆదివారం ఒక్కరోజు వివిధ విభాగాల ద్వారా సుమారు 40 లక్షల ఆదాయం లభించింది.

ఘనంగా సత్యదేవుడి రథసేవ :

సత్యదేవుడికి వారాంతపు అర్జిత సేవయిన రథోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఉదయం 10గంటలకు స్వామి,అమ్మవార్లను ప్రదానాలయం నుండి తోడ్కొనివచ్చి టేకురథంపై ఆశీనులు గావించి అర్చకస్వాములు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తుల గోవిందనామస్మరణలు, పండితుల వేదమంత్రోచ్చరణల నడుమ ముమ్మారు ప్రదక్షణ గావించారు. అనంతరం హారతులిచ్చి ప్రదానాలయానికి తీసుకెళ్లారు.

'లోవ' ఆదాయం రూ.2.48 లక్షలు

తునిరూరల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రం లోవ దేవస్థానానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. తలుపులమ్మ అమ్మవారిని అర్చకస్వాములు సర్వాంగసుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ప్రత్యేక క్యూలైన్లలో బారులు తీరిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. సుదూర ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు ఆలయ ప్రాంగణంలోని వసతిగదులు, ఆరు బయట వంట షెడ్లలో వంటావార్పు చేసుకుని కుటుంబ సమేతంగా సహపంక్తి భోజనాలు చేశారు. వివిధ విభాగాల ద్వారా రూ.2.48 లక్షల ఆదాయం సమకూరినట్టు ఈవో విశ్వనాథరాజు తెలిపారు. తుని రూరల్ సీఐ చెన్నకేశవ ఆధ్వర్యంలో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేసి వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టారు.

మళ్లీ కాలువలోకి కారు

- ప్రాణాలతో బయటపడిన వాహనదారుడు
- ప్రమాదాన్ని చూస్తూ..రెండు ద్విచక్రవాహనాలు ఢీ
- పది రోజుల వ్యవధిలో ఇది రెండో ప్రమాదం
- భయాందోళనలకు గురవుతున్న స్థానికులు


కాలువలోకి దూసుకుపోయిన కారును తీస్తున్న దృశ్యం

పి.గన్నవరం, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): పి.గన్నవరం మండలం ఉడిమూడి శివారు చింతావారిపేటవద్ద పదిరోజులక్రితం జరిగిన ప్రమాదంలో ఒక మహిళ, ఇద్దరు చిన్నారులు చనిపోయారు. ఈసంఘటన మరువక ముందే మళ్లీ కారు పంట కాలువలోకి దూసుకుపోయిది. ఈ రోడ్డు ఇరుకుగా ఉండడంతో ప్రయాణం చేయాలంటే స్థానికులు, ప్రయాణికులు భయాందోళన చెందుతున్నారు. అధికారులు, నాయకులు ఇటువంటి ప్రమాదాలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. రావులపాలెం వైపు నుంచి వస్తున్న కారు ప్రమాదవశాత్తు అదుపుతప్పి ప్రధాన పంట కాల్వలోకి దూసుకుపోయింది. వివరాలు ఇలా ఉన్నాయి... డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమజిల్లా అల్లవరం మండలం దేవగుప్తంనకు చెందిన పోసిన పెద్ది సాయిధీరజ్ రావులపాలెం నుంచి తమ బంధువులు ఇంటికి రాజోలు మండలం కడలి గ్రామానికి కారులో బయలుదేరాడు. ఈక్రమంలో రాజవరం-పొదలాడ రోడ్డులో ఉడిమూడి శివారు చింతావారిపేట వద్దకు వచ్చేసరికి ప్రమాదవశాత్తు కారు ప్రధాన పంటకాల్వలోకి దూసుకుపోయింది. దీంతో చాకచక్యంగా వ్యవహరించి వెనుక భాగంలో ఉన్న డిక్కీని ఒపెన్ చేసి బయటపడటంతో స్థానికులు ఒడ్డుకు చేర్చారు. అదే సమయంలో ప్రమాదం జరిగిన తీరును పరిశీలిస్తూ....అటుగా వస్తున్న ద్విచక్ర వాహనదారుడిని వెనుక వస్తున్న మరో ద్విచక్ర వాహనదారుడు బలంగా ఢీకొట్టాడు. ఈఘటనలో వెనుకవస్తున్న వాహనదారుడు (పశ్చిమగోదావరిజిల్లా కైకరంనకు చెందిన)కి బలమైన గాయంకావడంతో 108సాయంతో కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. స్వల్పగాయాలతో బయటపడిన సాయిధీరజ్ స్థానికులు సాయంతో కారును బయటకు తీశారు.

పదిరోజుల వ్యవధిలో.. రెండో ప్రమాదం

ఒక ప్రమాదం జరిగి పదిరోజులు పూర్తి కాకుండానే కూతవేటు దూరంలో అదేమాదిరిగా మరో ప్రమాదం జరగటంతో స్థానిక ప్రజానీకంతో పాటు వాహనదారులు సైతం తీవ్రభయాందోళనకు గురవుతున్నారు. ఈనెల 10వతేదీ తెల్లవారుజామున జరిగిన ఘోర కారు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన తల్లి, ఇద్దరు కుమారులు మృతి చెందిన సంగతి పాఠకులకు విదితమే. ఆ సంఘటనను మరువక ముందే మరో ఘటన అదే ప్రాంతంలో చోటుచేసుకుంది. ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి రాజవరం-పొదలాడ రోడ్డులో పొదలాడ నుంచి గంటి వరకు కాలువ వైపు రక్షణగా ఇనుప రైలింగ్‌ను ఏర్పాటుచేసి ప్రమాదాలను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

రాజమహేంద్రవరం
• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి
ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

సీఎం సహాయ నిధి చెక్కులు అందజేత



చెక్కులు అందజేస్తున్న బత్తుల వెంకటలక్ష్మి

కోరుకొండ, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ పరిధిలోని అనారోగ్యంతో బాధపడుతున్న పలువురికి వైద్య సహాయం నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, జనసేన కో ఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తోకాడ గ్రామానికి చెందిన నాగవరపు గంగాభవానికి రూ.23,400, పంపన శ్రీను కుటుంబానికి రూ.15,350 చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వాసుపత్రిలో మెరుగైన వైద్యాన్ని అందజేయడమే కాకుండా అత్యవసర పరిస్థితుల్లో వైద్య చికిత్స చేయించుకున్న వారికి ప్రభుత్వం సీఎంఆర్ఎఫ్ ద్వారా వైద్య ఖర్చులు అందజేస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన స్వల్పకాలంలోనే ప్రభుత్వాసుపత్రిలో నాణ్యమైన వైద్య సేవలందేలా పటిష్టమైన చర్యలు తీసుకున్నామని చెప్పారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

లక్ష్మీగణపతి ఆలయంలో సత్యప్రమాణాలకు నాలుగేళ్లు

నేడు ఆలయంలో ఎమ్మెల్యే నల్లమిల్లి ప్రత్యేక పూజలు



లక్ష్మీగణపతి ఆలయంలో సత్య ప్రమాణాలు చేస్తున్న అప్పటి ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి, ప్రతిపక్ష నేత నల్లమిల్లి(ఫైల్)

అనపర్తి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): నాలుగేళ్ల క్రితం ఇదే రోజున అనపర్తి నియోజకవర్గంలో రాజకీయ విభేదాలు రచ్చకెక్కి బిక్కవోలు లక్ష్మీగణపతి ఆలయంలో అధికార, ప్రతిపక్ష నాయకులు సత్యప్రమాణాలు చేయడం రాష్ట్రంలో సంచలనంగా మారింది. సత్యప్రమాణాలు చేసి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో కూటమి నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. అప్పట్లో సత్యప్రమాణాలు చేసిన నేతలు ఫలితాలు వచ్చే ఎన్నికల్లో స్వామి చూసుకుంటారని ప్రకటనలు చేసుకున్నారు. చివరకు 2024 ఎన్నికల సమయంలో నల్లమిల్లి తప్పుడు ప్రమాణం చేశారని అందుకే సీటు కోల్పోయారని ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి ప్రకటన చేయడం తర్వాత క్రమంలో సీటు కూడా లేదన్న రామకృష్ణారెడ్డి బీజేపీ తరఫున టికెట్ పొంది విజయం సాధించారు. ఇప్పటికైనా తప్పుడు ప్రమాణాలు ఎవరు చేశారో అర్థమైందని ఎమ్మెల్యే నల్లమిల్లి ప్రకటించారు. ఈ నేపథ్య ఘటన జరిగి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా కూటమి నాయకులు సోమవారం లక్ష్మీగణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.

మహిళలపై లైంగిక దాడులను అరికట్టాలి

పీవోడబ్ల్యు రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో అధ్యక్షురాలు ఏసమ్మ

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న లైంగిక దాడులను అరికట్టాలని పీవోడబ్ల్యు రాష్ట్ర అధ్యక్షురాలు శీలం ఏసమ్మ, ప్రధాన కార్యదర్శి పి.అనసూయ డిమాండ్ చేశారు. రాజమహేంద్రవరంలోని మావో భవన్‌లో ఆదివారం ప్రగతిశీల మహిళా సంఘం (పీవోడబ్ల్యు) రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఆరు నెలలు గడచినా మహిళలకు, రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను, సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేయడంలో విఫలమయ్యారని విమర్శించారు. సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ కేంద్ర కమిటీ నాయకురాలు పి.టాన్యా మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అంబానీ, అదానీ వంటి కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తు దేశాన్ని సర్వనాశనం చేస్తున్నారని ఆరోపించారు. సోమవారం దేశవ్యాప్తంగా రైతు, కార్మిక, ప్రజా సంఘాలు చేస్తున్న ఆందోళనలకు న్యూ డెమోక్రసీ మద్దతు ఇస్తోందన్నారు. పలు తీర్మానాలు ఆమోదించారు. కార్యక్రమంలో పీవోడబ్ల్యు రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పి. విజయ, రజియా, నాయకులు పాల్గొన్నారు.

కోట సత్తెమ్మకు పూజలు

నిడదవోలు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మరాజుపాలెం లో కోట సత్తెమ్మ తల్లి దేవ స్థానంలో ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సుప్రభాత సేవ, ధూపహారతి, నిత్యార్చనా, లలితా పారాయణం, సహస్రనామ కుంకుమ పూజలు చేశారు. అనంతరం క్షీర, మహానివేదన చేశారు. ప్రత్యేక పూల అలంకరణలో ఉన్న అమ్మవారిని భక్తులు దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఘనంగా క్రిస్మస్

కడియం, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): కడియంలోని షారోను దైవిక స్వస్థతశాలలో క్రిస్మస్ సంబరాలు ఘనంగా జరిగాయి. రెవ. దేవరపల్లి రతన్‌రాజు వాక్యోపదేశం చేశారు. కొవ్వొత్తులతో హేపీ క్రిస్మస్, మేరీ క్రిస్మస్ అంటూ ఏసును స్తుతించారు. సుజనీస్వాతి పేదలకు వస్త్రాలు అందజేశారు.కార్యక్రమంలో గౌరి, సీత, షారోన్, వివేక్, సుజన్ అభిషేక్, భాగ్యశ్రీ పాల్గొన్నారు

ట్రాఫిక్ చిక్కులు

- గోకవరంలో రోజురోజుకు తీవ్రమవుతున్న ట్రాఫిక్ సమస్య
- ప్రధాన రహదారిపై ఇష్టానుసారం వాహనాల నిలుపుదల
- రాణా సెంటర్‌లో తరచూ ప్రమాదాలు
- నియంత్రణ చర్యలు శూన్యం



గోకవరం రాణా సెంటర్ సమీపంలో నిలిచిపోయిన ట్రాఫిక్(ఫైల్)

గోకవరం, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన గోకవరంలో ట్రాఫిక్ సమస్య రోజురోజుకు తీవ్రమవుతోంది. పాతబస్టాండ్, ఆంజనేయస్వామి గుడి సెంటర్, రాణా సెంటర్, ఆర్టీసీ డిపో సమీపంలోని ప్రధాన రహదారిపై వాహనాలను ఇష్టానుసారంగా నిలుపుతుండడంతో ప్రజలు, పాదచారులు నానా ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం ఈ ప్రాంతాల్లో వాహనాల రాకపోకలు ఎక్కువగా ఉంటాయి.అవే ప్రాంతాల్లో దుకాణాలు, వాణిజ్య బ్యాంకులు, ఇతర వ్యాపార సంస్థలు అనేకం ఉన్నాయి. దీంతో వాహనదారులు రోడ్లపైనే పార్కింగ్ చేసి తమ కార్యకలాపాలను పూర్తి చేసుకుంటుంటారు. ఈ క్రమంలో ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలు తప్పించుకుని వెళ్లే దారిలేక నానా అగచాట్లు చవిచూడాల్సి వస్తోంది. ముఖ్యంగా రాణా సెంటర్ సమీపంలో ఉన్న ఇరుకు వంతెన వద్ద వాహనాల రాకపోకలు పెద్ద గండంగా మారింది. ఈ ప్రాంతంలో పెద్ద మలుపు, ఆ మలుపులో భారీ వృక్షం ఉండడం వల్ల ఎదురెదురుగా వచ్చే వాహనాల జాడ దగ్గరికి వచ్చే వరకు తెలి యదు. దీనివల్ల ఇక్కడ ఎక్కువగా ప్రమాదాలు సంభవిస్తున్నాయి. గతంలో ఈ వంతెన వద్ద అనేక ప్రమాదాలు జరిగిన పలువురు మృత్యువాతపడ్డారు. గతంలో రాణా సెంటర్ వద్ద పోలీ సులు ఉండి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించే వారు, కొంతకాలంగా పోలీసులు దానిని విస్మరించడంతో వాహనదారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ట్రాఫిక్ కారణంగా విద్యార్థులు ఉదయం పాఠశాలలకు, సాయంత్రం సమయంలో ఇళ్లకు వెళ్లేందుకు ఎక్కువ సమయాన్ని ఇక్కడే వెచ్చించాల్సి వస్తుంది. సంబంధిత అధికారులు స్పందించి గోకవరంలో ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

'ఆరోగ్య సహాయకులకు న్యాయం చేయాలి'

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : వైద్య ఆరోగ్యశాఖలో ఏళ్ల తరబడి పనిచేస్తూ ఇటీవల ఉద్యోగాల నుంచి తొలగించబడిన ఆరోగ్యసహాయకుల (హెల్త్ అసిస్టెంట్ల)కు ప్రభుత్వం న్యాయం చేయాలని, తొలగించిన ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకోవడం ద్వారా వారి కుటుంబాలను సీఎం ఆదుకోవాలని ఏపీ కాంట్రాక్టు పారామెడికల్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ జీవీవీ ప్రసాద్ కోరారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటనవ విడుదల చేశారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా వందలమంది ఆరోగ్య సహాయకుల కుటుంబాలు దిక్కుతోచని స్థితిలో ఉన్నాయన్నారు. తెలంగాణ హైకోర్టు తీర్పును బూచిగా చూపించి రాష్ట్రంలోని దాదాపు వెయ్యిమంది కాంట్రాక్టు హెల్త్ అసిస్టెంట్లను రాత్రికి రాత్రి తొలగించడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. హెల్త్ అసిస్టెంట్లకు జరిగిన అన్యాయాన్ని ఇటీవల మంగళగిరిలో జరిగిన ప్రజాదర్బార్‌లో సీఎం దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని, సీఎం తప్పకుండా న్యాయం చేస్తారనే ఆశాభావంతో ఉన్నామన్నారు.

వాహనాల పార్కింగ్‌లో మార్పులు

● ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు ● కూడళ్ల పరిశీలనలో కమిషనర్ కేతన్ గార్గ్



ట్రాఫిక్ పోలీసులతో కలిసి నగరంలో కూడళ్లు పరిశీలిస్తున్న కమిషనర్

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్, ట్రాఫిక్ పోలీస్ శాఖలు సమన్వయంతో సమిష్టిగా కృషి చేయాలని కమిషనర్ కేతన్ గార్గ్ అన్నారు. రాజమహేంద్రవరంలో పలు కూడళ్లను ట్రాఫిక్ పోలీసులు, టౌన్ ప్లానింగ్ పబ్లిక్ హెల్త్ విభాగాల అధికారులతో కలిసి ఆదివారం సాయంత్రం పరిశీలించారు. ముఖ్యకూడళ్లలో ట్రాఫిక్ సమస్య అధికంగా ఉందన్నారు. ప్రజలు తమ వాహనాలను ఇష్టానుసారం పార్కింగ్ చేస్తున్నారని అందువల్ల ఇబ్బందులు ఏర్పడి ప్రమాదాలకు దారి తీస్తున్నాయన్నారు. దీనికి పరిష్కార మార్గంగా వాహనాల పార్కింగ్ విషయంలో మార్పులు చేస్తున్నామన్నారు. కూడళ్లకు 50 అడుగుల దూరంలో వాహనాలు నిలుపుదల చేసేలా ప్లాన్ చేస్తున్నామని కార్లు, బైక్‌లు వేర్వేరుగా నిలిపేలా చూస్తామన్నారు. ట్రాఫిక్ నియంత్రణకు అవసరమైన పరికరాలు, సామగ్రి, వివరాలు పూర్తిస్థాయిలో తయారు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో సిటీ ప్లానర్ జి.కోటయ్య, డిప్యూటీ సిటీ ప్లానర్ సీహెచ్.సత్యనారాయణరాజు, ఎంహెచ్‌వో డాక్టర్ వినూత్న, ట్రాఫిక్ పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

క్రీస్తు జీవితం ఆదర్శప్రాయం

గోపాలపురం, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): నేటి యువతకు క్రీస్తు జీవితం ఆదర్శప్రాయమని యేసన్నా మినిస్ట్రీస్ పాస్టర్ ఏసురాజు అన్నారు. గోపాలపురంలో ఆదివారం పలువురు సండే స్కూల్ క్రిస్మస్‌తాత వేషధారణలో చెక్‌పోస్టు సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో యేసన్న మినిస్ట్రీస్ సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

పీఆర్‌టీయూ రాష్ట్రాధ్యక్షుడు మిట్టా కృష్ణయ్య



ప్రమాణ స్వీకారం చేస్తున్న పీఆర్‌టీయూ నూతన కార్యవర్గం

రాజమహేంద్రవరం సిటీ/రాజానగరం, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు సమస్యలను వెంటనే పరిష్కరించాలని (ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్(పీఆర్‌టీయూ)రాష్ట్రాధ్యక్షుడు మిట్టా కృష్ణయ్య డిమాండ్ చేశారు. రాజమహేంద్రవరం తాడితోట సంహిత కాలేజీ ఆవరణలో ఆదివారం నిర్వహించిన జిల్లా కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్థికేతర ఉపాధ్యాయుల సమస్యలతో పాటు ఆర్థిక సంబంధమైన డీఏ బకాయిలు, పీఆర్‌సీ ఏరియర్లను ఉపాధ్యాయులకు వెంటనే విడుదల చేయాలని, ఉపాధ్యాయులకు మధ్యంతర భృతిని 30శాతం ఇవ్వాలని డిమాండ్ చేశారు. హైస్కూల్ ప్లస్‌లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని కోరారు. అనంతరం పీఆర్‌టీయూ నూతన కార్యవర్గ ఎన్నికలు నిర్వహించారు. రాజానగరం మండలం వెలుగుబంద ఎంపీపీయూపీ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు వై.అగ్నేశ్వరరావు జిల్లా కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అధ్యక్షుడిగా పి.రాజారావు(కోరుకొండ), వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఐవీ.రమణ(నిడదవోలు) ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా కాకినాడ జిల్లా పీఆర్‌టీయూ అధ్యక్షుడు సి.ప్రదీప్‌కుమార్ వ్యవహరించారు. కార్యక్రమంలో మండల పీఆర్‌టీయూ నాయకులు పాల్గొన్నారు. నూతన కార్యకవర్గానికి పలువురు నాయకులు, అభినందనలు తెలియజేశారు.

గ్రంథాలయానికి పుస్తకాల వితరణ

రాజమహేంద్రవరం కల్చరల్, డిసెంబర్ 22(ఆంధ్రజ్యోతి): సీనియర్ సిటిజన్స్ సంక్షేమ వేదిక ఆధ్వర్యంలో నడుస్తున్న డాక్టర్ ఏబీ నాగేశ్వరరావు మెమోరియల్ గ్రంథాలయానికి ఆదివారం పోటీ పరీక్షల పుస్తకాలను అందజేశారు. విశాఖపట్నానికి చెందిన అధ్యాపకురాలు రాజేశ్వరి,న్యాయవాది పి.శ్రీనివాసరావు విరాళం అందజేసినట్టు సంఘాధ్యక్షుడు అశోక్‌కుమార్ జైన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కాసాని శంకరరావు,బండి నరేంద్ర,మహంతి లక్ష్మణరావు,కెకె.సంజీవరావు,పడాల అప్పారావు,మారిశెట్టి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.




12వ డివిజన్‌లో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

నగరాభివృద్ధికి అధిక ప్రాధాన్యం

ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్లుగా అభివృద్ధికి నోచుకోని రాజమహేంద్రవరాన్ని అభివృద్ధి చేసి చూపిస్తామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. రాజమహేంద్రవరం ఒకటో డివిజన్‌లో రూ.18 లక్షలు, 12వ డివిజన్‌లో రూ.27 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలకు శిలాఫలకాలను ఆవిష్కరించారు. వైసీపీ నేతల్లా పబ్లిసిటీ కోసం పనిచేయనని ఎన్నికల ముందు నగర ప్రజలకు ఏదైతే హామీలు ఇచ్చానో వాటిని నెరవేర్చడం కోసం కష్టపడుతున్నానన్నారు. నగరంలో డ్రైనేజీలు, సీసీ రహదారుల సమస్యల పరిష్కారానికి తొలి ప్రాధాన్యత ఇచ్చామన్నారు. ఆరు మాసాలకే సుమారు రూ.70 కోట్లు విలువైన పనులు చేపట్టామన్నారు. కార్యక్రమంలో డివిజన్ కూటమి నాయకులు పాల్గొన్నారు.



ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న షిర్డీసాయి విద్యా సంస్థల చైర్మన్ శ్రీధర్

గణిత ఒలింపియాడ్‌లో విద్యార్థుల ప్రతిభ

రాజమహేంద్రవరం రూరల్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): అసోసియేషన్ ఫర్ ఇంప్రూవ్‌మెంట్ ఆఫ్ మేథమెటిక్స్ ఎడ్యుకేషన్ (ఏఐఎంఈడీ) గణిత ఒలింపియాడ్‌లో రాజమహేంద్రవరంకు చెందిన శ్రీషిర్డీసాయి విద్యానికేతన్ విద్యార్థులు రాష్ట్రస్థాయి ర్యాంకులు కైవసం చేసుకున్నట్టు డైరెక్టర్ శ్రీవిద్య తెలిపారు. తమ పాఠశాలలో తొమ్మిదో తరగతి విద్యార్థి జి.జయంత్ అశ్విన్, జి.శ్రీఅంజలిప్రణయ్ రాష్ట్రస్థాయిలో ప్రథమ ర్యాంకు కైవసం చేసుకోగా, ఐ.కశ్యప్ వంశీ (10వ తరగతి), జి.అనూష నాగ లిఖిత (7వ తరగతి) 2వ ర్యాంకు, కేవీవీ ప్రియాంక (9వ తరగతి), సీహెచ్‌ఆర్ఎస్ షణ్ముఖ్, జె.ఆర్నవ్‌సాయి(7వ తరగతి) 3వ ర్యాంకు పొందారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను శ్రీవిద్యతోపాటు విద్యా సంస్థల చైర్మన్ తంబాబత్తుల శ్రీధర్, లక్ష్యా డీన్ కె.శ్రీనివాస్ తదితరులు అభినందించారు.

గౌతమి టేబుల్ టెన్నిస్ క్రీడాకారుల విజయకేతనం

రాజమహేంద్రవరం కల్చరల్ డిసెంబర్ 22 (ఆంధ్రజ్యోతి): కాకినాడ సీత నరసింహ క్షేత్ర స్పోర్ట్స్ ఆడిటోరియంలో ఆదివారం జరిగిన ఏపీ స్టేట్ ఇంటర్ డిస్ట్రిక్ట్ టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్‌లో పలువురు విద్యార్థులు ప్రతిభ చూపారు. రాజమహేంద్రవరం గౌతమి టేబుల్ టెన్నిస్ అకాడమీకి చెందిన జి.సిరిపావని, వై.వైష్ణవి, ఎస్.లోహిత్ సూర్య ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించారు. కార్యక్రమంలో శ్రీప్రకాష్ డైరెక్టర్ విజయ ప్రకాష్, అధ్యక్షుడు జేవీవీ అప్పారెడ్డి, కార్యదర్శి అండ్ కోచ్ వీటీవీ సుబ్బారావు, కె.సత్యనారాయణ, పీవీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



గౌతమి టేబుల్ టెన్నిస్ అకాడమీకి చెందిన క్రీడాకారులు



బిక్కవోలు గోలింగేశ్వరస్వామిని దర్శించుకున్న న్యాయమూర్తులు

ప్రాచీన ఆలయాలను దర్శించిన న్యాయమూర్తులు

బిక్కవోలు, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): బిక్కవోలులోని ప్రాచీన ఆలయాలను ఆదివారం రాత్రి కాకినాడ, విశాఖ జిల్లాల న్యాయమూర్తులు దర్శించుకున్నారు. ముందుగా లక్ష్మీగణపతిని దర్శించుకుని అనంతరం గోలింగేశ్వర, కుమార సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వార్లను దర్శించి పూజలు జరిపారు. వీరికి ఆలయ అర్చకులు సన్నిధిరాజు సుబ్రహ్మణ్యశర్మ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి వేద ఆశీర్వచనాలు అందజేశారు. దర్శించిన వారిలో కాకినాడ జిల్లా పీజేసీజే కమ్ జెఎఫ్‌సీఎం జడ్జి వి.లీలాశ్యామసుందరి, విశాఖ జిల్లా జడ్జి ఎస్.కవిత, సబ్ జడ్జి ఎం.ప్రదీప్‌కుమార్ వున్నారు.



దుర్గాదేవిని దర్శించుకున్న దృశ్యం

వైభవంగా దుర్గమ్మ తీర్థం

కోరుకొండ, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని మధురపూడిలో దుర్గమ్మ తీర్థం ఆదివారం వైభవంగా జరిగింది. ఇరవై గంటల పాటు నిర్విరామంగా జరిగే ఈ జాతరలో సుమారు రూ.10 లక్షల బాణసంచా కాల్చడం ప్రత్యేకత. అమ్మవారిని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణచౌదరి, బీజేపీ ఇన్‌చార్జి నీరుకొండ వీరన్నచౌదరి, వైసీపీ నాయకురాలు జక్కంపూడి విజయలక్ష్మి తదితరులు దర్శించుకున్నారు. అవాంచనీయ సంఘటనలు జరగకుండా సీఐ సత్యకిషోర్, ఎస్ఐ శ్యామ్ సుందర్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

వాసవీ ఇంటర్నేషనల్‌కు అవార్డులు

రాజమహేంద్రవరం కల్చరల్ డిసెంబర్ 22 (ఆంధ్రజ్యోతి): వాసవీ క్లబ్ విస్తృత సేవలు అందిస్తున్నదని డిస్ట్రిక్ట్ గవర్నర్ కాళ్ళకూరి ప్రవీణ్‌కుమార్ అన్నారు. లాలాచెరువు రోడ్డులోని వైశ్య హాస్టల్‌లో ఆదివారం వాసవీ క్లబ్ విజయోత్సవ సభను జరిపారు. వాసవి ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 215ఏకు ఈ ఏడాది అంతర్జాతీయ స్థాయిలో 111 అవార్డులు లభించాయన్నారు. కార్యక్రమంలో ప్రెసిడెంట్ కె.రవిచంద్రన్, బి.సాయి సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ హబ్‌గా రాజమహేంద్రవరం

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరాన్ని స్పోర్ట్స్ హబ్‌గా ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు సహకారంతో అభివృద్ధి చేస్తామని ఏపీ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ అనిమిని రవినాయుడు అన్నారు. శాప్ చైర్మన్ రవినాయుడు ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసుతో కలిసి రాజమహేంద్రవరంలో కార్పొరేషన్, శాప్ నిధులతో నిర్మిస్తున్న స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను ఆదివారం పరిశీలించారు. రాజమహేంద్రవరంలో రూ58.50 కోట్లతో మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం, స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ల నిర్మాణాలకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాజమహేంద్రవరంలో నేషనల్ గేమ్స్ నిర్వహణకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. కార్యక్రమంలో డీఎస్‌డీవో శేషగిరిరావు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్ కుమార్, నగర ఉపాధ్యక్షుడు జానకి రామయ్య, సలాది ఆనంద్, రాయుడు గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన హనుమద్ వ్రతాలు

కడియం, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): జేగురుపాడులో ఐదు రోజులపాటు జరిగిన హనుమద్ వ్రతాల్లో ఆంజనేయ స్వామికి పంచామృతాభిషేకాలు, తమలపాకు, సింధూర పూజలు జరిగాయి. ఆదివారం ఆలయం వద్ద అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దాతలు అనపర్తి నీటి సంఘం డైరెక్టర్ పెనుమర్తి వెంకట్రావు దంపతులను, పెద్దిరెడ్డి చిట్టిబాబు దంపతులను ఆలయ కమిటీ సత్కరించింది. కార్యక్రమంలో ఉప సర్పంచ్ పాతూరి రాజేష్, ఎంపీటీసీ నాగిరెడ్డి రామకృష్ణ, మర్రెడ్డి రమేష్, ఆలయ కమిటీ వనమాలి అబ్బులు, నాగిరెడ్డి సత్యనారాయణ, పుట్టా దుర్గారావు, శెట్టి గాంధీ తదితరులు పాల్గొన్నారు.

మహిళల మూత్ర సమస్యలకు ఆధునిక వైద్యం

యూరో గైనకాలజి సదస్సులో వైద్య నిపుణులు

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): మహిళల్లో తలెత్తే మూత్రాశయం, మూత్రనాళాల సమస్యలకు ఆధునాతన వైద్య విధానాలతో సరైన పరిష్కారం లభిస్తోందని యూరాలజిస్ట్ డాక్టర్ ఎస్.మల్లికార్జునరెడ్డి, యూరో గైనకాలజీ వైద్యుడు కోడూరి అనురాధ అన్నారు. రాజమహేంద్రవరం సాయి హాస్పిటల్స్ సినాప్స్ ఆడిటోరియంలో ఆదివారం జరిగిన యూరో గైనకాలజీ సదస్సులో మాట్లాడారు. నలభై ఏళ్ల పైబడిన మహిళలు చాలా మందిలో మూత్రాశయం, మూత్రనాళాల సమస్యల వల్ల వస్తున్నాయన్నారు. మూత్రం సంకేతాలు మొదలైన తరువాత చాలా మంది మహిళలు అదుపు చేసుకోలేక ఇబ్బంది పడుతుంటారన్నారు. యూరాలజిస్ట్ డాక్టర్ హరికృష్ణ మాట్లాడారు. సదస్సులో యూరాలజిస్టులు డాక్టర్ సత్యప్రసాద్, డాక్టర్ గౌతమ్‌రెడ్డి, గైనకాలజి వైద్య నిపుణులు అరుణకుమారి, దేవి, పద్మజ, జ్యోతి, దీప్తి, విశ్వనాథ్, బిందు తదితరులు పాల్గొన్నారు.

మాతృశ్రీ శారదా మాత జయంతి

రాజమహేంద్రవరం కల్చరల్, డిసెంబర్ 22(ఆంధ్రజ్యోతి): రామకృష్ణ మఠంలో ఆదివారం శారదామాత 172వ జయంతి ఉత్సవాన్ని ఘనంగా జరిపారు. దీనిలో భాగంగా ఉదయం జపం, మంగళహారతి, సుప్రభాతం, వేద పఠనం, విశేష పూజ జరిపారు. హోమ కార్యక్రమం అనంతరం స్వామి శశికాంతానందజీ మహరాజ్, స్వామి పరిజ్ఞయానందజీ మహరాజ్, శారదామాత జీవితం, సందేశాలపై ప్రసంగించారు. కార్యక్రమంలో స్వామి రఘువీరానందజీ మహరాజ్, స్వామి సేవానందజీ మహరాజ్, స్వామి ప్రజ్ఞానాధానందజీ మహరాజ్, బ్రహ్మచారి కరణ్, భక్తులు, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం 700 మందికి పైగా భక్తులకు ప్రసాద వితరణ చేశారు. సాయంత్రం పుష్కర ఘాట్ వద్ద గల శారదా మండపంలో శ్రీశారదామాతకు స్వామీజీలతో వేద పఠనం, హారతి నిర్వహించారు.



రామకృష్ణ మిషన్‌లో మాతృశ్రీ శారదాదేవి 172వ జయంతి ఉత్సవం దృశ్యం



శ్రీనివాస్‌కు మొక్కను అందిస్తున్న పల్ల వెంకన్న నర్సరీ రైతులు

పర్యావరణ పరిరక్షణకు నర్సరీ రైతుల కృషి అభినందనీయం

సీనియర్ సంపాదకులు శ్రీనివాస్

కడియం, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణలో నర్సరీ రైతుల కృషి అభినందనీయమని సీనియర్ సంపాదకులు కె.శ్రీనివాస్ తెలిపారు. రాజమహేంద్రవరంలో జరిగిన కార్యక్రమానికి హాజరైన ఆయన కుటుంబ సభ్యులతో కలిసి కడియం పల్ల వెంకన్న నర్సరీని సందర్శించారు. ఆయనకు నర్సరీ రైతులు పల్ల సత్తిబాబు, వెంకటేష్, వినయ్ మొక్కను అందజేశారు. నర్సరీలో వివిధ రకాల మొక్కలు, వాటి విశిష్టతను వారు తెలిపారు.


27న సీపీఐ మహాసభ

గోపాలపురం, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): సీపీఐ శతదినోత్సవ సభను విజయవంతం చేయాలని జిల్లా కార్యదర్శి తాటిపాక మధు అన్నారు. సీపీఐ నాయకులతో ఆదివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. రాజమహేంద్రవరంలో ఈ నెల 27న మహాసభ నిర్వహిస్తామన్నారు.

సినిమా గైడ్

(రాజమహేంద్రవరం)

శ్యామల	: విడుదల-2
సూర్యామినీ	: ముఫాసా
సూర్యాప్యాలస్	: యూఐ
స్వామి	: ముఫాసా
శివజ్యోతి	: పుష్ప-2
అనుశ్రీ(సాయికృష్ణ)	: బచ్చలమల్లి
రాజా	: పుష్ప-2
ఊర్వశి	: ముఫాసా
రంభ	: మిస్‌యూ
మేనక	: లక్కీ భాస్కర్
అప్సర	: పుష్ప-2
కుమారి	: ముఫాసా
అశోక	: బచ్చలమల్లి
వీఎస్ మహల్(నామవరం)	: పుష్ప-2
మురళీకృష్ణ(ధవళేశ్వరం)	: పుష్ప-2, విడుదల
వెంకటసూర్య(కడియం)	: ముఫాసా, పుష్ప-2
సత్యగౌరి (అనపర్తి)	: పుష్ప-2
సూర్యశ్రీ (అనపర్తి)	: బచ్చలమల్లి
ఫార్చ్యూన్ సినిమాస్(రాజానగరం)	: మట్కా
రామకృష్ణ(కోరుకొండ)	: ---
గీతాసినిమాస్ (సీతానగరం)	: పుష్ప-2
శ్రీనివాస (గోకవరం)	: ---
టీడీ సినీ మ్యాక్స్ (గోకవరం)	: పుష్ప-2
లలితామహల్(రంపచోడవరం)	: పుష్ప-2
నవయుగ(చింతూరు)	: -----





మళ్లీ కాలువలోకి కారు

గతంలో ఎక్కడైతే ప్రమాదం జరిగిందో మళ్లీ అక్కడే ప్రమాదం జరిగి కారు కాలువలోకి దూసుకుపోయింది.. గత ప్రమాదంలో తల్లీ..ఇద్దరు కుమారులు మృతిచెందగా.. ప్రస్తుత ప్రమాదంలో గాయాలతో బయటపడ్డారు. -8లో



కొవ్వూరులో శుక్రవారం జరిగిన టీడీపీ సమావేశంలో కార్యకర్తల ఆందోళన

కొవ్వూరులో ఫ్లెక్సీ

వల సలసల!

కొవ్వూరులో భగ్గుమంటున్న టీడీపీ నాయకులు

- రాజీవ్‌కృష్ణ చేరికపై అసహనం
- నెల తరువాత ఆందోళన
- ఐదేళ్లు కష్టపడ్డ మా పరిస్థితేంటి?
- ఇటీవల సమావేశంలో గొడవ
- ఇంత వరకూ మౌనానికి కారణం?
- పార్టీ వర్గాల్లో తీవ్ర చర్చ
- అధిష్ఠానం వద్ద నిర్ణయం

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

కొవ్వూరు టీడీపీలో వలసలపై సలసల కాగుతున్నారు. వైసీపీ నాయకులు టీడీపీలో చేరడంపై భగ్గుమంటున్నారు.గత ఐదేళ్ల వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు మమ్మల్ని ఇబ్బందులకు గురిచేసిన నాయకులను ఎలా పార్టీలో చేర్చుకుంటారని మండి పడుతున్నారు. ఇటీవల జరిగిన నియోజకవర్గ టీడీపీ సమావేశంలోనూ స్థానిక నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రముఖ పారిశ్రామికవేత్త పి.కృష్ణబాబు అల్లుడు ఎస్.రాజీవ్‌కృష్ణ అనుచరులతో నవంబరు 14న తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్రమంత్రి నారా లోకేష్ సమక్షంలో తెలుగుదేశం పార్టీ కండువా కప్పుకున్నారు. నాటి నుంచి చిచ్చు రేగింది. కనీస సమాచారం లేకుండా రాజీవ్‌కృష్ణను పార్టీలో చేర్చుకోవడంపై స్థానిక నాయకులు గుర్రుగా ఉన్నారు. గత ఐదేళ్ల నియోజకవర్గంలో ఎన్నో ఇబ్బందులు పడ్డామని.. కేసులు కూడా అనుభవించామని.. ఇప్పుడు ఇలా చేయడం తగదని వాపోతున్నారు. సాధారణంగా ఒక నియోజకవర్గం నుంచి ఇతరులు పార్టీలో చేరేటప్పుడు పార్టీ కూడా అక్కడి పెద్దలు, ఎమ్మెల్యే, ఇతర నేతల అభిప్రాయాలు తీసుకోవడం సాధారణం. ఏమైందో ఏమో కానీ నేరుగా నారా లోకేష్ సమక్షంలోనే రాజధానిలో పార్టీలో చేర్పించుకున్నారు.దీంతో కొవ్వూరు నియోజకవర్గంలో వైసీపీ ఇంచుమించు ఖాళీ అయిపోయింది. రాజీవ్‌కృష్ణ అచ్చిబాబుకు వరసకు అల్లుడు కావడంతో పార్టీ మరింత బలోపేతమవుతుందని అప్పట్లో అధిష్ఠానం భావించింది. కృష్ణబాబు, అచ్చిబాబుల వారసుడిగా రాజీవ్‌కృష్ణ ఇక్కడ బలమైన నేత అవుతారని ప్రచారం జరిగింది. ప్రస్తుతం ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గంగా కొవ్వూరు ఉంది.2029లో జరిగే సార్వత్రిక ఎన్నికల నాటికి నియోజకవర్గాల పునర్విభజన నేపథ్యంలో రిజర్వేషన్లు మారే అవకాశం ఉన్నట్టు అంచనా ఉంది. ఈ నేపథ్యంలో ఎవరి రాజకీయ అంచనాలు, ఆలోచనలు, వ్యూహాలు వారికి ఉంటాయి.

టీడీపీకి రాజీవమా?

ఇటీవల క్రిస్మస్, నూతన సంవత్సర , సంక్రాంతి శుభాకాంక్షలు పేరుతో రాజీవ్‌కృష్ణ ఫొటోతో నియోజకవర్గంలో అనేక చోట్ల హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలు వెలిశాయి. అందులో ఎన్టీఆర్, ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు,డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తదితర నాయకుల ఫొటోలు ఉన్నాయి. ఇటువంటి హోర్డింగ్‌లు,ఫ్లెక్సీలు నియోజకవర్గం అంతా వెలిశాయి.దీంతో శుక్రవారం జరిగిన టీడీపీ సమావేశంలో ఎమ్మెల్యేద్విసభ్య కమిటీ సభ్యుల సమక్షంలో పలువురు కార్యకర్తలు ,కొందరు ద్వితీయ శ్రేణి నాయకులు రాజీవ్‌కృష్ణను పార్టీలో చేర్చుకోవడాన్ని తప్పుబట్టారు.దీంతో కొవ్వూరు నియోజకవర్గంతో పాటు,జిల్లాలో కూడా చర్చనీయాంశమైంది. పార్టీ కష్టకాలంలో ఉన్న సమయంలో పార్టీకి అండగా ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వాలని పలువురు డిమాండ్ చేశారు. రాజీవ్‌కృష పార్టీలో చేరిన సమయంలో ఎవరూ మాట్లాడలేదు. ఇవాళ కొందరు మాట్లాడడం వల్ల అధిష్ఠానం వారి మాటలను ఎలా తీసుకుంటుందోననే చర్చ కూడా జరుగుతోంది. రాజీవ్‌కృష్ణ చేరిక వల్ల పార్టీకి నిస్సందేహంగా మేలు జరుగుతుంది. ఎందుకంటే గత వైసీపీ ప్రభుత్వంలో రాజీవ్‌కృష్ణ ప్రభుత్వ సలహాదారుగా వ్యవహరించారు. వైసీపీ ఓడిపోయిన తర్వాత ఓ సామాజికవర్గం పట్ల వైసీపీ వైఖరిని నిరసిస్తూ ఏకంగా మాజీ సీఎం జగన్‌కు బహిరంగ లేఖ కూడా రాశారు. డైరెక్ట్‌తో జగన్‌తో ఢీ అంటే ఢీ అన్నారు. అటువంటి నాయకుడు టీడీపీలో చేరడం వల్ల నియోజకవర్గంలో పార్టీ బలోపేతమవుతుందనేది పలువురి వాదన. సమస్యలు ఏమైనా ఉంటే పార్టీలో అందరూ కూర్చుని మాట్లాడుకునే అవకాశం ఉంది. లేదా పార్టీనే తలు, ఎమ్మెల్యే ద్వారా లేదా అక్కడ పెద్దగా ఉన్న అచ్చిబాబు ద్వారా అయినా తమ ఇబ్బం దులేమైనా ఉంటే చెప్పుకునే అవకాశమూ లేకపోలేదు. కానీ ఆకస్మికంగా రోడ్డెక్కడం వల్ల పార్టీకి నష్టం జరుగుతుందనే అంచనా ఉంది. కార్యకర్తలు పార్టీని దృష్టిలో పెట్టుకుని ఆలోచించాల్సి ఉంది. ఎస్సీ నియోజకవర్గం కావడంతో ఇప్పటి వరకూ కొవ్వూరు నియోజకవర్గానికి ఎక్కడెక్కడి నుంచో నేతలు వచ్చి పోటీ చేస్తున్నారు. గత ఎన్నికల్లో గోపాలపురం నుంచి వచ్చిన ముప్పిడి వెంకటేశ్వరరావు పోటీ చేసి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. వచ్చే కాలంలో రిజర్వేషన్లు మారే అవకాశం ఉన్నందు న ఇప్పటి నుంచే నాయకుడిని తయారు చేసేఆలోచనలో అధిష్ఠానం ఉన్నట్టు సమాచారం.

అభివృద్ధికి కొవ్వూరు దూరం..

ఇప్పటి వరకూ కొవ్వూరు నియోజకవర్గంలో అభివృద్ధి కంటే కొందరు నేతలు వ్యక్తిగత లబ్ధికే ప్రాధాన్యత ఇస్తారనే విమర్శ ఉంది. అందుకే గోదావరికి ఒక పక్క ఉన్న రాజమహేంద్రవరం మహానగరంగా విస్తరిస్తుంటే.. గోదావరికి మరో పక్కన ఉన్న కొవ్వూరు అభివృద్ధికి దూరంగా ఉంటుంది. ముఖద్వారాల వద్ద, గోదావరి ఒడ్డున పాడై పోయి ఉన్న పార్కుల చూస్తే కొందరి నేతల మనస్తత్వం అర్థం అవుతుంది. రాజమహేంద్రవరానికి ధీటుగా కొవ్వూరు ఎదగాలి. ఇవి రెండూ జంట నగరాలుగా ఎదగడానికి అవసరమైన అనేక వనరులు, ఈప్రాంత ప్రాధాన్యతలు ఉన్నాయి.ఇటువంటివి పట్టించుకుంటేనే నాయకులవుతారు. కొవ్వూరులో మాత్రం దీనికి రివర్స్ రాజకీయాల్లో ప్రజల ప్రయోజనాలకన్నా.. వ్యక్తిగత ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇచ్చే ధోరణి ఇటీవల బాగా పెరిగిందనే విమర్శలు ఉన్నాయి. ఇది ఎస్సీ నియోజకవర్గం కావడంతో అక్కడ ఎమ్మెల్యేల అభ్యర్థులను ప్రతి ఎన్నిక ల్లోనూ మార్చేస్తున్నారనే విమర్శ ఉంది. రాజీవ్ కృష్ణను వ్యతిరేకించడంలో కూడా కొంతమంది స్వార్థపూరిత రాజకీయాలు ఉన్నాయనే చర్చ ఉంది. రాజీవ్‌కృష్ణ కూడా అందరినీ కలుపుకుని పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలను,నేతలకు కూడా ప్రాధాన్యత ఇవ్వలసిన అవసరం ఉంది. గతంలోనే ఇక్కడ ఏమైనా సమస్యలుంటే నచ్చ చెప్పి ఎవరి ప్రాధాన్యత వారికి ఇస్తూ పార్టీని ముందుకు నడిచేలా చూడాలని విజయనగరం జిల్లాకు చెందిన ఓ నేతకు బాధ్యత అప్పగించింది.



సూరీడుకి.. కోపమొచ్చిందా!

మూడు రోజులుగా ఎండలేదు.. అల్పపీడనం నేపథ్యంతో రోజంతా మబ్బుగానే ఉంటుంది.. సూరీడు వచ్చినా కనిపించడంలేదు..సూరీడుకి కోపం వచ్చిందో ఏమో ఆదివారం సాయంత్రం రాజమహేంద్రవరం రోడ్ కం రైలు బ్రిడ్జి వద్ద గోదావరిలో ఇలా ఎర్రబడ్డాడు.. తన వెలుగును ప్రసరింపజేసి అస్తమించాడు..ఈ సుందర దృశ్యాన్ని పలువురు సెల్‌ఫోన్లలో బంధించారు. - కొవ్వూరు

సిబ్బంది ఉండరు.. హెల్ప్ చేయరు!

జీజీహెచ్‌లో పేరుకే హెల్ప్‌లైన్



రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరం బోధనాసుపత్రి (జీజీహెచ్)కి నిత్యం వందల సంఖ్యలో రోగులు వస్తుంటారు. వైద్యం కోసం ఎక్కడెక్కడి నుంచో ఇక్కడకు రావడం జరుగుతుంది. ఇక్కడకు వచ్చే వారిలో చదువుకున్నవారికంటే చదువురాని వారు, వయస్సు మళ్లిన వారు ఎక్కువ. ఎంతో దూరం నుంచి వైద్యానికి వచ్చే వారికి ఆసుపత్రిలో ఏ విభాగం ఎక్కడుంటుంది ? ఏ వార్డు ఎక్కడ? ఏ డాక్టర్ ఎక్కడ ఉంటారు ? రక్త పరీక్షలు ఎక్కడ చేస్తారు ? వంటి సమాచారం తెలియదు. కొత్తగా వచ్చేవారికి, చదువుకున్నవారికి కూడా ఈ వివరాలు తెలియవు.అక్కడ పనిచేసే కొద్దిమంది సిబ్బందికి మినహా మిగిలిన వాళ్లు అయోమయపడతారు. ఇక రోగులు, వారి సహాయకులు మరింత గందరగోళానికి గురవుతారు. ఓపీ చీటి పట్టుకుని ఈ నెంబరు గది ఎక్కడుంది, ఈ పరీక్షలు ఎక్కడ చేస్తారు అంటూ అక్కడ కనిపించిన వారందరినీ అడుగుతుంటారు. ఈ క్రమంలో దాదాపు రోగులు తీవ్ర అవస్థలు పాలవుతుంటారు. దీంతో మూడు నెలల కిందట ఆసుపత్రి అధికారులు హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసి జీడీఏ స్థాయి కల్గిన ఒక చిరుద్యోగికి డ్యూటీ వేసి చేతులు దులుపుకున్నారు. ఓపీ కారిడార్‌ను అనుకుని ఏర్పాటు చేసిన ఈ హెల్ప్ డెస్క్ పనితీరుపై రోగులు, వారి సహాయకులు పెదవి విరుస్తున్నారు. హెల్ప్ డెస్క్‌లో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 వరకూ డ్యూటీ చేయాల్సి ఉంటుంది. హెల్ప్ డెస్క్‌లో సమాచారం ఇచ్చేందుకు సిబ్బంది లేకపోవడంతో రోగులు, వారి సహాయకులకు ఎప్పటిలానే ఇక్కట్లు తప్పడం లేదు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో హెల్ప్ డెస్క్‌లో సిబ్బంది విధుల నిర్వహణ తూతూ మంత్రంగా సాగుతున్నదనే ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి.

అందుబాటులో ఎరువులు

వ్యవసాయాధికారి మాధవరావు

రాజమహేంద్రవరం రూరల్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రబీలో రైతులకు కావాల్సిన ఎరువులు అందుబాటులో ఉన్నాయని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు తెలిపారు. దాళ్వాసీజన్‌లో ముఖ్యంగా వరి, ఇతర పంటలకు 1.10 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం ఉందన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో 1961 హెక్టార్లలో వరి నాట్లు వేశారని తెలిపారు. ప్రస్తుతం అన్ని రకాల ఎరువులు కలిసి 22,487 టన్నులు అందుబాటులో ఉన్నాయన్నారు. యూరియా 8,300 టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 7,800 టన్నులు, సూపర్ 2,100 టన్నులు, పొటాష్ 2,100 టన్నులు, డీఏపీ 928 టన్నులు అందుబాటులో ఉన్నట్టు తెలిపారు. సొసైటీలలో 7,800 టన్నులు, ప్రైవేట్ డీలర్స్ వద్ద 10,600 , మార్క్‌ఫెడ్‌లో 327 , డీసీఎంఎస్‌లో 1500, హోల్‌సేల్‌లో 900 పైచిలుకు రైతులకు అందుబాటులో ఉన్నాయన్నారు.



అనపర్తిలో డ్రోన్ కెమెరాలపై శిక్షణ

నేరగాళ్లపై.. మరో నేత్రం

అనపర్తి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : నేరగాళ్ల పసిగట్టే పనిలో పోలీసులు ఉన్నారు..నిఘా వ్యవస్థను మరింత పటిష్టం చేయనున్నారు.. నిన్నటి వరకూ ఎక్కడైనా చోరీ జరిగినా.. హత్య జరిగినా సీసీ కెమెరాలే ఆధారం.. సీసీ కెమెరాలో ఆధారం దొరక్కపోతే అంతే.. సీసీ కెమెరాలు ఎన్నో కేసులను ఛేదించిన ఘటనలు ఉన్నాయి. అయితే ప్రస్తుతం నేరాల సంఖ్య పెరిగింది. ఈ నేపథ్యంలో పోలీసులు ఆధునికతవైపు చూస్తున్నారు. దీనిలో భాగంగా పోలీసులు మరో కొత్త విధానానికి శ్రీకారం చుట్టబోతున్నారు. దీనిలో భాగంగా ఇప్పటికే పోలీసులకు శిక్షణ ఇస్తున్నారు.. త్వరలో ప్రతి పోలీస్‌స్టేషన్‌కు డ్రోన్ కెమెరాలను అందించనున్నారు. పట్టణాలకే పరిమితమైన డ్రోన్ వినియోగం పల్లెల్లోని పోలీసులకు అందుబాటులోకి తీసుకురానున్నారు.అనపర్తిలో పోలీసు సిబ్బందికి ఆదివారం డ్రోన్ కెమెరాల వినియోగంపై ప్రత్యేక శిక్షణ అందించారు.ఎస్ఐ శ్రీను నాయక్ మాట్లాడుతూ డ్రోన్ కెమెరాలతో నేరాల అదుపు సులభతరం మవుతుందన్నారు.



భూ..మాయ!

కన్నుపడిందా ఖాళీ ఆక్రమించేస్తున్నారు.. పత్రాలు మార్చి వేరొకరికి విక్రయించేస్తున్నారు.. జిల్లాలో ఇటువంటి ఘటనలు యథేచ్ఛగా సాగుతున్నాయి.. అధికారుల పర్యవేక్షణ కొరవడి భూబకాసురుల ధాటికి బలైపోతున్నారు..తాజాగా రాజానగరం మండలం చక్రద్వారబంధం.. తాళ్ళపూడి మండలం తిరుగుడుమెట్టలో జరిగిన ఘటనలే నిదర్శనం.

- యథేచ్ఛగా భూముల అక్రమ రిజిస్ట్రేషన్లు
- ఎకరా రూ. కోటి భూమి రూ.30 లక్షలకే
- చక్రద్వారబంధంలో అడ్డుకున్న గ్రామస్తులు
- తిరుగుడుమెట్ట భూమిదీ అదే పరిస్థితి
- పోలీస్ స్టేషన్లలో కేసులు



చక్రద్వారబంధంలో భూమి వద్ద గొడవ

రాజానగరం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : భూముల ధరలకు రెక్కలు రావడంతో అక్రమార్కులు కొంత మంది రాత్రికి రాత్రే నకిలీ దస్తావేజులు, దొంగ వీలునామాలు సృష్టించి భూయజమానుల కళ్లు కప్పి భూముల క్రయ విక్రయాలకు పాల్పడుతున్నారు. దీనిని నిరోధించాల్సిన కొంత మంది అధికారులు అక్రమార్కులకు దాసోహమై అందిన కాడికి దండుకుని రికార్డులు తారుమారు చేసేస్తున్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజానగరం మండలం చక్రద్వారబంధం, తాళ్ళపూడి మండలం తిరుగుడుమెట్టలో ఘటనలే అందుకు నిదర్శ నం. చక్రద్వారబంధం గ్రామంలో సర్వే నెంబరు 688-1బి; 689-1; 690, 691-6 వెరసి ఎకరాలు 5.587 సెంట్లు భూమి కొమ్మురెడ్డి లక్ష్మీనరసింహం పేరుతో దఖలు పడి ఉంది.ఈ భూమి మామిడి, జీడి మామిడి, సీతాఫలం వృక్షాలతో నిండి ఉంటుంది. సదరు పొలాన్ని గ్రామానికి చెందిన పేపకాయల పోతురాజు గత మూడు దశాబ్దాలుగా కౌలుకు సాగుచేస్తూ వస్తున్నారు. సంబంధిత భూయజమాని గతించిపోవడం, వారసు లకు ఇక్కడ భూమి ఉందన్న విషయం తెలియక పోవడంతో కౌలు రైతు పోతురాజు అధీనంలోనే ఉండి పోయింది. సదరు భూమికి వారసులు ఎవరో తెలియక పోవడంతో దీనిపై కన్నేసిన కొంతమంది స్థానిక వైసీపీ నాయకులు ఇటీవల వైసీపీ మండల ప్రజాప్రతినిధి సహకారంతో సదరు భూమిని విక్రయించేందుకు ఉప క్రమించారు. దీంతో గత కొంతకాలంగా గ్రామంలో వివాదం నెలకొంది.ప్రస్తుత మార్కెట్ విలువ ఎకరం రూ.కోటి వరకు ధర పలుకుతుంది. అయితే సదరు వైసీపీ నాయకులు మాత్రం కారు చౌకగా ఎకరా రూ.30 లక్షలు వంతున విక్రయించినట్లుగా గ్రామంలో చర్చసాగుతోంది. దీంతో ఇంకాస్త ముందడుగు వేసిన అక్రమార్కులు గత రెండు రోజులుగా సదరు పొలంలో ఉన్న చెట్లను తొలగించే పనులు చేపట్టారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు కొంతమంది ఆదివారం పొలంలోకి వెళ్లి పనులను అడ్డుకున్నారు.అప్పటికే చెట్లను తరలించేందుకు సిద్ధంగా ఉన్న ట్రాక్టర్‌ను అడ్డుకున్నా రు.నరికిన వృక్షాలను తరలిస్తే ఊరుకోబోమని చెప్పడం తో అక్కడే వదిలిపెట్టి చేసేది లేక సంఘటనా స్థలం నుంచి వెనుతిరిగారు. సదరు భూముల క్రయవిక్రయాల్లో జనసేనకు సంబంధించిన వాళ్ల కూడా భాగస్వాములుగా ఉన్నారని చెప్పడంతో ఒక దశలో ఘర్షణ వాతావరణం నెలకొంది. విషయం తెలుసుకున్న పోలీ సులు సంఘటనా స్థలా నికి చేరుకుని ఇరువర్గాలకు సర్దిచెప్పి అక్కడి నుంచి పంపించేశారు.అనంతరం భూముల విక్రయాన్ని వ్యతిరే కిస్తున్న గ్రామస్తులు కొంతమంది నన్నయ వర్సిటీ సమావేశంలో ఉన్న ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణను కలిసి వివరాలు వెల్లడించారు. దీనిపై ఎమ్మెల్యే స్పం దిస్తూ సదరు భూమికి సంబంధించి సక్రమమైన రికార్డుల్లేకుండా నకిలీ దస్తావేజులు సృష్టించి విక్ర యాలు సాగిస్తే చర్యలు తీసుకుంటామని గ్రామస్తు లకు హామీ ఇచ్చారు.ఈ విషయంలో ఏవిధమైన వివాదాలకు తావు లేకుండా ఉండేలా అవసరమైన సహాయ సహకారాలు అందించే దిశగా చూడాలని చెంతనే ఉన్న సీఐ ప్రసన్న వీరయ్య గౌడ్‌ను ఎమ్మెల్యే సూచించారు.

తిరుగుడుమెట్టలో పొలం.. తాడేపల్లిగూడెంలో అక్రమ రిజిస్ట్రేషన్

తాళ్లపూడి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) తమ పేర మీద గల భూమి మరొకరి పేర అక్రమంగా రిజిస్ట్రేషన్ జరిగిన సంఘటనపై తాళ్లపూడి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మండలంలోని తిరుగుడుమెట్ట గ్రామానికి చెందిన రెబ్బాప్రగడ సాయి కృష్ణకు వంశ పారంపర్యంగా గ్రామంలోని 202 సర్వే నెంబరులో య 0.93 సెంట్ల భూమి ఉంది. రెవెన్యూ రికార్డులు పరిశీలించుకనే తరుణంలో తమ పేరున ఉండాల్సిన భూమి ఏలూరు జిల్లా పోలవరం మండలం టేకూరు గ్రామానికి చెందిన చోడిశెట్టి శ్రీనివాసరావు పేర ఉండడంతో హతాశులయ్యారు.వేగేశ్వరపురం సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్‌లో నకలు చూడగా తాడేపల్లిగూడెం రిజిస్ట్రార్ కార్యాలయంలో అక్రమంగా వేరొకరిపేర రిజి స్ట్రేషన్ జరిగినట్టు గ్రహించి తాళ్లపూడి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్ఐరామకృష్ణ కేసు నమోదు చేశారు.

క్రీడారంగం అభివృద్ధికి చర్యలు

రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ రవినాయుడు



ఎమ్మెల్యే గోరంట్లతో శాప్ చైర్మన్ రవినాయుడు

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో క్రీడారంగం అభివృద్ధికి సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని, ఈ క్రమంలో దేశంలోనే అత్యుత్తమంగా ఏపీ స్పోర్ట్సు పాలసీని రూపొందించామని రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) చైర్మన్ ఏ.రవినాయుడు అన్నారు. రాజమహేంద్రవరంలో ఆదివారం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరిని కలసి నాగులాచెరువులోని క్రీడా వికాస కేంద్రాన్ని సందర్శించారు. అసంపూర్తిగా నిలిచిన క్రీడా వికాస కేంద్రాన్ని పరిశీలించి నిర్మాణ పనులపై జిల్లా స్పోర్ట్సు అథారిటీ అధికారులు, ఇంజనీరింగ్ అధికారులతో ఆరా తీశారు. నిర్మాణ పనులు నిలిచిపోవడానికి కారణాలు తెలుసుకున్నారు. వెంటనే పనులు ప్రారంభించాలని ఆదేశించారు. 2027లో అమరావతిలో జాతీయస్థాయి క్రీడా పోటీలు నిర్వహించేందుకు సీఎం ప్రణాళికలు రూపొందిస్తున్నారని వెల్లడించారు. స్కూల్ స్థాయి నుంచే క్రీడల్లో రాణించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదని ఆ దిశగా స్కూల్స్‌లో గ్రౌండ్సు ఏర్పాటుకు ప్రభుత్వం జీఓ జారీ చేసిందన్నారు. రూరల్ ఎమ్మెల్యే బుచ్చయ్యచౌదరి మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం క్రీడారంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేయడంతో గ్రౌండులో పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయన్నారు.

గుర్కాలు వేసుకుని వచ్చి.. బంగారం దోచుకుపోయారు

పట్టపగలే జ్యూయలరీ షాపులో ముగ్గురు మహిళల చోరీ

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): బంగారు వస్తువులు కొనుగోలు చేస్తున్నట్టుగా నటించిన ముగ్గురు మాయలేడీలు జ్యూవెలరీ నిర్వాహకుడికి మస్కా కొట్టి 80 గ్రాములు బంగారువస్తువులు అపహరించుకుపోయిన సంఘటన రాజమహేంద్రవరం గుండు వారి వీధిలో ఆదివారం చోటు చేసుకుంది. వన్‌టౌన్ పోలీసుల కథనం ప్రకారం. రాజమహేంద్రవరం గుండువారిలో ఉన్న వెంకట సాయి జ్యూవెలరీ షాపునకు ఆదివారం గుర్కాలు ధరించిన ముగ్గురు మహిళలు వచ్చారు. తమకు బంగారు ఉంగరాలు ,చెవిదిద్దులు వంటి వస్తువులు కావాలని చెప్పడంతో షాపులో ఉన్న వారు చూపించారు.కొద్ది సేపు చూసిన మహిళలు డిజైన్లు బాగోలేదని వెళ్లిపోయారు. కొంతసేపటి తరువాత షాపులో ఉన్న వ్యక్తికి షోకేసులో ఉన్న బంగారు వస్తువులు తక్కువగా ఉన్నట్లు అనిపించి వాటిని బయటకు తీసి చూశాడు. దీంతో బంగారు వస్తువులు 80 గ్రాముల వరకు తగ్గాయి.సీసీ ఫుటేజీని పరిశీలిస్తే గుర్కా ముసుగులో వచ్చిన ముగ్గురు మహిళలు గోల్డ్‌ను అపహరించుకుపోయినట్టు గుర్తించారు. షాపు యజమాని శ్రీనితిన్ ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.సీసీ ఫుటేజీని స్వాధీనం చేసుకున్నారు.

8
పీఆర్‌టీయూ జిల్లా కార్యవర్గం
చాగల్లులో తాగునీటికి కట్‌కట

బాబోయ్ కుక్కలు!

- దేవరపల్లిలో స్వైర విహారం
- వాహనదారులు, పాదచారులపై దాడులు
- హడలెత్తిపోతున్న మండల వాసులు



దేవరపల్లిలో స్వైరవిహారం చేస్తున్న కుక్కలు



దేవరపల్లి, డిసెంబరు 22(ఆంధ్ర జ్యోతి): దేవరపల్లి మండలంలో కుక్కలు బెడద ఎక్కువగా ఉండడంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. దేవరపల్లిలో ప్రధాన రహదారిలో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. వాహనదారులు, పాదచారులపై కుక్కలు ఒక్కసారిగా మీదపడడంతో ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. పల్లంట్లరోడ్డు సెంటరు, మూడుబొమ్మల సెంటర్, మూడురోడ్ల కూడలి వద్ద కుక్కలు అధిక సంఖ్యలో గుంపులు గుంపులుగా తిరుగుతుండడంతో స్కూల్ పిల్లలు, ప్రజలు హడలెత్తిపోతున్నారు. స్థానిక బస్టాండ్ వద్ద ప్రయాణికులు కూడా ఇబ్బందులు పడుతున్నారు. పల్లంట్ల, యర్నగూడెం గ్రామాల్లో కుక్కల బెడద ఎక్కువగా ఉందని ప్రజలు వాపోతున్నారు. పంచాయతీ అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

సీఎం సహాయ నిధి చెక్కులు అందజేత



సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు, డిసెంబరు 22: పేదల వైద్యానికి సీఎం సహాయ నిధి ద్వారా సహకారం అందజేస్తున్నట్టు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. ధర్మవరానికి చెందిన కొత్తపల్లి వీరరాఘవులుకు మంజూరైన రూ.27,070 సీఎం సహాయ నిధి చెక్కును ఆదివారం కొవ్వూరులోని టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదల విద్య, వైద్యానికి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ పెద్దపీట వేస్తున్నారన్నారు. నియోజకవర్గానికి చెందిన 9మందికి రూ.4,11, 900 సీఎం సహాయ నిధి నుంచి చెక్కులు మంజూరయ్యాయన్నారు. పార్టీ కార్యాలయంలో అన్నివేళల అందుబాటులో ఉంటానని, నియోజకవర్గంలో ప్రజలు, కార్యకర్తలు ఏ సమస్య వచ్చినా నేరుగా కలిసి తెలియజేయవచ్చునన్నారు. కార్యక్రమంలో సూర్యదేవర రంజిత్, గారపాటి వెంకటకృష్ణ, చింతపల్లి సతీష్, క్లస్టర్ ఇన్‌చార్జి పెనుమాక జయరాజు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి విజయానికి కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి

ఉండ్రాజవరం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరగబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అభ్యర్థి విజయానికి సమష్టి కృషి చేయాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు పేర్కొన్నారు. నియోజకవర్గంలోని టీడీపీ బూత్ కన్వీనర్లకు ఆదివారం వేలివెన్నులో ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ ఓటర్ వెరిఫికేషన్‌పై అవగాహన సమావేశంలో శేషారావు మాట్లాడారు. ప్రతి గ్రాడ్యుయేట్ ఓటును వినియోగించుకునేలా పార్టీ శ్రేణులు కృషి చేయాలన్నారు. నియోజవర్గంలో అన్ని ఓట్లు పోల్ అయ్యేలా బూత్ కన్వీనర్లు కష్టపడి పనిచేయాలని శేషారావు కోరారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఒకరి అరెస్టు

40 క్వార్టర్ బాటిల్స్ స్వాధీనం

కొవ్వూరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి 40 మద్యం క్వార్టర్ బాటిల్స్ స్వాధీనం చేసుకున్నట్టు సీఐ పి.విశ్వం ఆదివారం తెలిపారు. రోడ్డు కం రైలు బ్రిడ్జి సమీపంలోని ఎరినమ్మ ఘాట్ సమీపంలో ఎటువంటి అనుమతుల్లేకుండా, అధికరేట్లకు మద్యం విక్రయిస్తున్నట్టు వచ్చిన సమాచారంతో సిబ్బందితో దాడిచేశామన్నారు. కొవ్వూరులోని శ్రీనివాసపురానికి చెందిన పోతుగుంట శివ కాఫీ హోటల్ నడుపుతున్నాడు. మద్యం షాపుల్లో కొనుగోలు చేసిన బాటిల్స్‌ను ఎక్కువరేటుకు విక్రయిస్తున్నాడు. పోలీసులు రావడంతో కంగారుపడి గోనే సంచె తీసుకుని పారిపోయేందుకు ప్రయత్నించగా పట్టుకుని అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి రాయల్ లాన్సర్ క్వార్టర్ బాటిల్స్ 40 స్వాధీనం చేసుకుని, కేసునమోదు చేసినట్టు కొవ్వూరు సీఐ పేర్కొన్నారు.

వాహనాల పార్కింగ్‌లో మార్పులు

● ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు ● కూడళ్ల పరిశీలనలో కమిషనర్ కేతన్ గార్గ్



ట్రాఫిక్ పోలీసులతో కలిసి నగరంలో కూడళ్లు పరిశీలిస్తున్న కమిషనర్

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్, ట్రాఫిక్ పోలీస్ శాఖలు సమన్వయంతో సమిష్టిగా కృషి చేయాలని కమిషనర్ కేతన్ గార్గ్ అన్నారు. రాజమహేంద్రవరంలో పలు కూడళ్లను ట్రాఫిక్ పోలీసులు, టౌన్ ప్లానింగ్ ,పబ్లిక్ హెల్త్ విభాగాల అధికారులతో కలిసి ఆదివారం సాయంత్రం పరిశీలించారు. ముఖ్యకూడళ్లలో ట్రాఫిక్ సమస్య అధికంగా ఉందన్నారు. ప్రజలు తమ వాహనాలను ఇష్టానుసారం పార్కింగ్ చేస్తున్నారని అందువల్ల ఇబ్బందులు ఏర్పడి ప్రమాదాలకు దారి తీస్తున్నాయన్నారు. దీనికి పరిష్కార మార్గంగా వాహనాల పార్కింగ్ విషయంలో మార్పులు చేస్తున్నామన్నారు. కూడళ్లకు 50 అడుగుల దూరంలో వాహనాలు నిలుపుదల చేసేలా ప్లాన్ చేస్తున్నామని కార్లు, బైక్‌లు వేర్వేరుగా నిలిపేలా చూస్తామన్నారు. ట్రాఫిక్ నియంత్రణకు అవసరమైన పరికరాలు, సామగ్రి, వివరాలు పూర్తిస్థాయిలో తయారు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో సిటీ ప్లానర్ జి.కోటయ్య, డిప్యూటీ సిటీ ప్లానర్ సీహెచ్.సత్యనారాయణరాజు, ఎంహెచ్‌వో డాక్టర్ వినూత్న, ట్రాఫిక్ పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

పీఆర్‌టీయూ రాష్ట్రాధ్యక్షుడు మిట్టా కృష్ణయ్య



ప్రమాణ స్వీకారం చేస్తున్న పీఆర్‌టీయూ నూతన కార్యవర్గం

రాజమహేంద్రవరం సిటీ/రాజానగరం, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు సమస్యలను వెంటనే పరిష్కరించాలని (ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్(పీఆర్‌టీయూ)రాష్ట్రాధ్యక్షుడు మిట్టా కృష్ణయ్య డిమాండ్ చేశారు. రాజమహేంద్రవరం తాడితోట సంహిత కాలేజీ ఆవరణలో ఆదివారం నిర్వహించిన జిల్లా కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్థికేతర ఉపాధ్యాయుల సమస్యలతో పాటు ఆర్థిక సంబంధమైన డీఏ బకాయిలు, పీఆర్‌సీ ఏరియర్లను ఉపాధ్యాయులకు వెంటనే విడుదల చేయాలని, ఉపాధ్యాయులకు మధ్యంతర భృతిని 30శాతం ఇవ్వాలని డిమాండ్ చేశారు. హైస్కూల్ ఫ్లస్‌లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని కోరారు. అనంతరం పీఆర్‌టీయూ నూతన కార్యవర్గ ఎన్నికలు నిర్వహించారు. రాజానగరం మండలం వెలుగుబంద ఎంపీపీయూపీ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు వై.ఆగ్నేశ్వరరావు జిల్లా కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అధ్యక్షుడిగా పి.రాజారావు(కోరుకొండ), వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఐవీ.రమణ(నిడదవోలు) ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా కాకినాడ జిల్లా పీఆర్‌టీయూ అధ్యక్షుడు సి.ప్రదీప్‌కుమార్ వ్యవహరించారు. కార్యక్రమంలో మండల పీఆర్‌టీయూ నాయకులు పాల్గొన్నారు. నూతన కార్యకవర్గానికి పలువురు నాయకులు, అభినందనలు తెలియజేశారు.

మహిళలపై లైంగిక దాడులను అరికట్టాలి

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న లైంగిక దాడులను అరికట్టాలని ప్రగతిశీల మహిళా సంఘం (పీవోడబ్ల్యు) రాష్ట్ర అధ్యక్షురాలు శీలం ఏసమ్మ, ప్రధాన కార్యదర్శి పి.అనసూయ డిమాండ్ చేశారు. రాజమహేంద్రవరంలోని మావో భవన్‌లో ఆదివారం పీవోడబ్ల్యు రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఆరు నెలలు గడచినా మహిళలకు, రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను, సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేయడంలో విఫలమయ్యారని విమర్శించారు. సీపీఐ ఎంఎల్ నాయకురాలు పి.టాన్యా మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అంబానీ, అదానీ వంటి కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తు దేశాన్ని సర్వనాశనం చేస్తున్నారని ఆరోపించారు.

'వాసవీ'కి అవార్డులు

రాజమహేంద్రవరం కల్చరల్ డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): వాసవీక్లబ్ విస్తృత సేవలు అందిస్తోందని డిస్ట్రిక్ట్ గవర్నర్ కాళ్ళకూరి ప్రవీణ్ కుమార్ అన్నారు. లాలాచెరువు రోడ్డులోని వైశ్య హాస్టల్‌లో ఆదివారం వాసవీ క్లబ్ విజయోత్సవ సభను జరిపారు. వాసవి ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 215ఏకు ఈ ఏడాది అంతర్జాతీయ స్థాయిలో 111 అవార్డులు లభించాయన్నారు.

క్రీడలకు ప్రభుత్వం పెద్దపీట

- శాప్ చైర్మన్ రవినాయుడు
- ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో క్రీడానిర్మాణాల పరిశీలన



నన్నయలో మాట్లాడుతున్న శాప్ చైర్మన్ రవి, ఎమ్మెల్యే బత్తుల

దివాన్‌చెరువు, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): భారత జాతీయ పతాకాన్ని, ఆంధ్రప్రదేశ్ ఖ్యాతిని ప్రపంచ దేశాల్లో చాటి చెప్పాలనే ఉద్దేశ్యంతో లోటుబడ్జెట్‌లో ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేస్తోందని రాష్ట్ర క్రీడాసాధికారసంస్థ (శాప్) చైర్మన్ అనిమిని రవినాయుడు అన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో ఖేలో ఇండియా నిధులతో నిర్మిస్తున్న మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం, స్విమ్మింగ్ ఫూల్ పనులను ఆయన, స్థానిక ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణతో కలసి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యా శాఖా మంత్రి ఆదేశాల మేరకు పాఠశాలల్లో క్రీడా మైదానం ఖచ్చితంగా ఉండాలన్నారు. నన్నయ విశ్వవిద్యాలయంలో జరగాల్సిన పనులు అనుకున్న సమయానికి జరగలేదని, కాంట్రాక్టర్ ఉదాసీనంగా వ్యవహరిస్తూ పనులు జాప్యం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రభుత్వానికి క్రీడాకారుల భవిష్యత్ ఎంతో ముఖ్యమైనదని దానికి తగినట్టుగా జవాబుదారీతనంతో వ్యవహరిస్తున్నామని చెప్పారు. గతంలో విశ్వవిద్యాలయంపై ఎన్నో అభియోగాలు వచ్చినప్పటికీ ప్రస్తుత వీసీ శ్రీనివాసరావు నాయకత్వంలో వాటిని సరిదిద్దే ప్రయత్నం చేస్తున్నామన్నారు. పనుల నిర్మాణాలను పరిశీలించామని ఎట్టి పరిస్థితుల్లోనూ వచ్చే ఏడాది మార్చి నెలాఖరుకు ఇండోర్‌స్టేడియం, స్విమ్మింగ్ ఫూల్ పనులు పూర్తి కావాలన్నారు. నన్నయ విశ్వవిద్యాలయంలో జాతీయ క్రీడలు నిర్వహించే స్థాయికి ఇక్కడ వసతులు సమకూర్చాలని ఆదేశించారు. తాము ఆదేశించిన సమయానికి పనులు పూర్తికాకపోతే చర్యలు తీసుకుంటామని చెప్పారు. కాంట్రాక్టర్‌ను బ్లాక్ లిస్ట్‌లో పెడతామని రవినాయుడు తెలిపారు. గతంలో 2016లో చంద్రబాబునాయుడు రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసిన క్రీడా వికాస కేంద్రాలను కనుమరుగు చేశారని ఆరోపించారు. వాటిపై దృష్టి సారిస్తామన్నారు. జాతీయ క్రీడలకు రాష్ట్రంలోని క్రీడాకారులంతా సంసిద్ధంగా ఉండాలని కోరారు. అందుకు శాప్ పూర్తి సహాయసహకారాలు అందిస్తామని శాప్ చైర్మన్ చెప్పారు. నన్నయ విశ్వవిద్యాలయంలో సింథటిక్ ట్రాక్ ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలు వచ్చాయని వాటిని పరిశీలించి ఆమోదించేందుకు ప్రయత్నిస్తామన్నారు. పాఠశాలల నుంచి క్రీడలను ప్రోత్సహించేందుకు కార్యాచరలు రూపొందిస్తున్న నేపథ్యంలో విశ్వవిద్యాలయంలో క్రీడావసరులు ఇంకా పటిష్టంగా ఉండాలన్నారు. దీనికి భిన్నంగా గత ప్రభుత్వ వైఖరి వల్ల విశ్వవిద్యాలయాల్లో క్రీడావసతులు లేకుండా పోయాయని అన్నారు. రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ ఖేలో ఇండియా నిధులతో నిర్మిస్తున్న పనులు సకాలంలో పూర్తి కాకపోవడంతో సీఎం, హెచ్‌ఆర్‌డీ మంత్రుల దృష్టిలో ఉన్న అంశాన్ని పరిశీలించేందుకు శాప్ చైర్మన్ వచ్చి ఇక్కడ పనులు పరిశీలించారన్నారు. విజయవాడలో 50మీటర్లు స్విమ్మింగ్ ఫూల్ నన్నయ విశ్వవిద్యాలయంలో రావడం ఆనందకరమని చెప్పారు. మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం, స్విమ్మింగ్ ఫూల్ నిర్మాణ పనులు ప్రతి రోజూ మోనటరింగ్ చేయాలని సూచించారు. శాప్ చైర్మన్ ఆదేశించిన తేదీలోపు నిర్మాణ పనులు నాణ్యతతో పూర్తిచేయాలని లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామన్నారు. వీసీ ఆచార్య శ్రీనివాసరావు మాట్లాడుతూఇటీవల కాలంలో విశ్వవిద్యాలయం లో రాజకీయపరమైన ఒత్తిళ్లు లేకుండా చక్కని పరిపాలన అందించేందుకు అవకాశం దక్కిందన్నారు. శాప్ చైర్మన్ ఆదేశించిన తేదీలోపు నిర్మాణాలు పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య కేవీ స్వామి, డిప్యూటీ రిజిస్ట్రార్ ఎస్.లింగారెడ్డి, విశ్వవిద్యాలయం ఇంజనీర్ కె.నూకరత్నం, విద్యాకళాశాల చైర్మన్ కె.సుబ్బారావు, శాప్ అధికార్లు, ఇంజనీర్లు, నాయకులు, పీడీలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శాప్ చైర్మన్ రవినాయుడు

తాగునీటికి ఇబ్బందులు!

చాగల్లు ఎస్సీ ఏరియాలో సక్రమంగా సరఫరా కాని పంచాయతీ నీరు

చాగల్లు, డిసెంబరు 22, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన చాగల్లు ఎస్సీ ఏరియాలో రెండు రోజులుగా తాగునీరు సరఫరా సక్రమంగా లేక స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. నిర్ణీత సమయంలోనే నీరు సరఫరా చేయడం వల్ల పూర్తిస్థాయిలో ప్రజల అవసరాలకు సరిపోవడం లేదని అంటున్నారు. ఆదివారం ఉదయం సైతం సకాలంలో నీరు సరఫరా చేయలేదన్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి మహ్మద్ ఆలీ మాట్లాడుతూ రెండు రోజులుగా సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగడం వల్ల తాగునీటి సరఫరాకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని అన్నారు.

కోట సత్తెమ్మకు పూజలు



నిడదవోలు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మరాజుపాలెం లో కోట సత్తెమ్మ తల్లి దేవస్థానంలో ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సుప్రభాత సేవ, ధూపహారతి, నిత్యార్చనా, లలితా పారాయణం, సహస్రనామ కుంకు మ పూజలు చేశారు. అనంతరం క్షీర, మహానివేదన చేశారు. ప్రత్యేక పూల అలం కరణలో ఉన్న అమ్మవారిని భక్తులు దర్శిం చుకున్నారు. ఆదివారం అమ్మవారికి ఇష్ట మైన రోజు కావడంతో పలు జిల్లాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయం కళకళలాడింది. భక్తులు భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ సిబ్బంది అమ్మవారి దర్శనం కలుగజేశారు.

క్రీస్తు జీవితం ఆదర్శప్రాయం



గోపాలపురం, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): నేటి యువతకు క్రీస్తు జీవితం ఆదర్శప్రాయమని యేసన్నా మినిస్ట్రీస్ పాస్టర్ ఏసురాజు అన్నారు. ఆదివారం పలువురు సండే స్కూల్ క్రిస్మస్‌తాత వేషధారణలో చెక్‌పోస్టు సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో యేసన్న మినిస్ట్రీస్ సభ్యులు పాల్గొన్నారు.

శ్రీనివాస్ సంపాదకీయాలు సమాజాన్ని చైతన్యం చేశాయి

సీనియర్ సంపాదకులు డాక్టర్ శ్రీనివాస్‌తో గెట్ టు గెదర్‌లో వక్తలు



సంపాదకులు శ్రీనివాస్‌ను గజమాలతో సత్కరిస్తున్న పాత్రికేయులు

రాజమహేంద్రవరంసిటీ, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): సీనియర్ సంపాదకులు శ్రీనివాస్ సంపాదకీయాలు, రచనలు సమాజాన్ని చైతన్యం చేశాయని పలువురు వక్తలు అన్నారు. రాజమహేంద్రవరం ఏకేసీ రోటరీ రివర్ సిటీ హాలులో ఆదివారం డాక్టర్ శ్రీనివాస్‌తో ఏపీ యూడబ్ల్యూజే, ది రాజమండ్రి ప్రెస్‌క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో 'సమయం.. సందర్భం' పేరిట గెట్ టు గెదర్ కార్యక్రమం సీనియర్ పాత్రికేయులు వీఎస్ఎస్ కృష్ణకుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఏపీయూడ బ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి మండెల శ్రీరామ్మూర్తి, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు కుడుపూడి పార్థసారథి ఆహూతులను వేదిక పైకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, ప్రముఖ న్యాయవాది ముప్పాళ్ల సుబ్బారావు, సీసీసీ ఎండీ పంతం కొండలరావు, ప్రముఖ మానసిక వైద్యులు కర్రి రామారెడ్డి, గుడా మాజీ చైర్మన్ గన్ని కృష్ణ, రచయితలు అద్దే పల్లి ప్రభు, మారిశెట్టి జితేంద్ర, ముక్కామల చక్రధర్, టీడీపీ నేత యర్రా వేణుగోపాలరాయుడు, దేశిరెడ్డి బలరామనాయుడు, చాంబర్ పూర్వపు అధ్యక్షుడు అశోక్‌కుమార్ జైన్, సాహితీవేత్త యర్రాప్రగడ రామకృష్ణ, అయ్యల గోపి, సన్నిధానం శాస్త్రి, రాకా కార్యదర్శి జీవీ రమణ, ఆంధ్రజ్యోతి బీఎం ఎస్.శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో మీడియా విస్తృతి, విలేకరులు, సోషల్ మీడియా పెరగడం వంటి పరిణామాలు ప్రజాస్వామ్యానికి మంచిదేనన్నారు. జర్నలిజంలోకి కొత్తగా వస్తున్నవారిలో చాలా ధైర్యంగా రాసేవాళ్లు ఉన్నారన్నారు. రాజమహేంద్రవరంతోను, గోదావరితోను, వీరేశలింగం పంతుల తోటతోను తనకున్న అనుబంధాలను గుర్తు చేసుకున్నారు. తొలుత ఎమ్మెల్యే గోరంట్ల మాట్లాడుతూ ఆంధ్రజ్యోతి పత్రిక నిబద్ధతతో తన పంథాను కొనసాగిస్తోందని, సాహిత్యానికి కూడా పెద్దపీట వేస్తోందన్నారు. సంపాదకులుగా పనిచేసిన శ్రీనివాస్ తన ప్రస్థానం కొనసాగించాలన్నారు. ఉండవల్లి అరుణ్‌కుమార్ మాట్లాడుతూ ఐడియాలజీ, ఫిలాసఫీతో నడిపే పత్రికల్లో ఆంధ్రజ్యోతి ఒకటని, అటువంటి పత్రికలో సిద్ధాంత బద్ధంగా పనిచేస్తూ ప్రభుత్వాలను నిలదీసే సంపాదకీయాలు రాసిన శ్రీనివాస్ విలువలకు పెద్ద పీట వేశారని కొనియాడారు. ఉభయగోదావరి జిల్లాల పాత్రికేయులు కలిసి ఆంధ్రజ్యోతి పక్షాన శ్రీనివాస్‌ను గజమాలతో, శాలువాలతో సత్కరించారు. ఏపీయూడబ్ల్యూజే, ప్రెస్‌క్లబ్ పక్షాన జ్ఞాపికలను అందించారు.

రాష్ట్ర వ్యాసరచన పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

- కొవ్వూరులోని ఉన్నత పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కళాశాలల నుంచి 705 మంది హాజరు
- 411 మంది ఉత్తీర్ణత



ఉత్తీర్ణత పత్రాలతో సంస్కృత పాఠశాల విద్యార్థులు

కొవ్వూరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో మానవతా విలువలు పెంపొందించడం అంశంపై శ్రీ సత్యసాయి సేవా సంస్థ విద్యా విభాగం ఆధ్వర్యంలో సెప్టెంబరు 27, 28, 29 తేదీల్లో నిర్వహించిన రాష్ట్రవ్యాప్త వ్యాసరచన పోటీల్లో 411 మంది ఉత్తీర్ణులయినట్టు సత్యసాయి సేవా సంస్థల ఆధ్యాత్మిక విభాగ సమన్వయకర్త ఎన్‌వీ సాయిరామ్ తెలిపారు. ఈ పోటీల్లో కొవ్వూరులోని 11 ఉన్నత పాఠశాలలు, 3 జూనియర్ కళాశాలలు, 3 డిగ్రీ కళాశాలల నుంచి 705 మంది విద్యార్థులు పాల్గొనగా 411 మంది ఉత్తీర్ణత సాధించారు. జిల్లాస్థాయిలో ఉన్నత పాఠశాలల విభాగంలో హోలి ఏంజిల్స్ విద్యార్థి గారపాటి నేహ తెలుగు మాధ్యమంలో ప్రథమస్థానం, జూనియర్ కళాశాలల విభాగంలో గవర్నమెంటు జూనియర్ కళాశాల విద్యార్థి టి.యశస్విని తెలుగు మాధ్యమంలో ప్రథమ స్థానం, ఆర్.తేజస్విని ఆంగ్ల మాధ్యమంలో ద్వితీయస్థానం, డిగ్రీ కళాశాలల స్థాయిలో ఏబీఎన్, పీఆర్ఆర్ కళాశాల విద్యార్థి తెలుగు మాధ్యమంలో చోళ్ల జయశ్రీ ప్రథమస్థానం, ఆంగ్ల మాధ్యమంలో ఆకుల కుసుమ దుర్గాభవాని ద్వితీయస్థానం, వాడ్రేవు జోగమ్మ వేద సంస్కృత కళాశాలకు చెందిన కె.సంతోషి తెలుగు మాధ్యమంలో ద్వితీయస్థానం, ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ఎ.అమృత ఆంగ్ల మాధ్యమంలో ఉత్తీర్ణత సాధించారన్నారు. ఉత్తీర్ణులైన విద్యార్థులకు బహుమతులు, ఉత్తీర్ణత పత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి కన్వీనర్ కె.సత్యనారాయణ, సత్యసాయి అన్నదాన పథకం వైస్ ప్రెసిడెంటు బి.వెంకటేశ్వరరావు, గ్రంధి శేషు తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ శతదినోత్సవ సభను జయప్రదం చేయాలి

జిల్లా కార్యదర్శి తాటిపాక మధు

గోపాలపురం, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ) శతదినోత్సవ సభను విజయవంతం చేయాలని పార్టీ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు అన్నారు. సీపీఐ ముఖ్య నాయకులతో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మధు మాట్లాడుతూ భారతదేశంలో సీపీఐ పార్టీ ఆవిర్భవించి ఈ నెల 26వ తేదీ నాటికి 100 వసంతాలు పూర్తి చేసుకుంటుందన్నారు. దేశవ్యాప్తంగా కార్మిక, కర్షక ఉద్యోగ, ఉపాధి కల్పన సామాజిక న్యాయం కోసం చారిత్రాత్మక పోరా టాలు చేసిన ఘనత సీపీఐది అని అన్నారు. భూమి కోసం, భుక్తి కోసం శ్రమజీవుల హక్కుల కోసం దోపిడి వ్యవస్థపై నిరంతరం పోరాటం చేసిన పార్టీ సీపీఐ అన్నారు. దున్నే వాడిదే భూమి అన్న నినాదంతో ప్రతీ పేదవాడికి రెండెకరాల భూమి ప్రతిపాదన తెచ్చి దాన్ని సహకారం చేయడానికి పార్టీ నిరంతరం శ్రమించిందన్నారు. వంద వసంతాల సందర్భంగా రాజమహేంద్రవరంలో ఈ నెల 27న జరిగే మహాసభకు సీపీఐ నాయకులు, కార్యకర్తలు, సానుభూతిపరులు భారీగా తరలి రావాలన్నారు. సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు బీ.నాగేశ్వరరావు, జ్యోతిరాజు, తోట లక్ష్మణ్, ఎం.ప్రసాద్, వెంకట్రావు, కొవ్వాడయ్య, తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ కాలువలోకి కారు

- ప్రాణాలతో బయటపడిన వాహనదారుడు
- ప్రమాదాన్ని చూస్తూ..రెండు బైక్‌లు ఢీ
- పది రోజుల వ్యవధిలో రెండో ప్రమాదం
- భయాందోళనలో స్థానికులు



కాలువలోకి దూసుకుపోయిన కారును తీస్తున్న దృశ్యం

పి.గన్నవరం, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): పి.గన్నవరం మండలం ఉడిమూడి శివారు చింతావారి పేటవద్ద పదిరోజులక్రితం జరిగిన ప్రమాదంలో ఒక మహిళ, ఇద్దరు చిన్నారులు చనిపోయారు. ఈసంఘటన మరువక ముందే మళ్లీ కారు పంట కాలువలోకి దూసుకుపోయిది. ఈ రోడ్డు ఇరుకుగా ఉండడంతో ప్రయాణం చేయాలంటే స్థానికులు, ప్రయాణికులు భయాందోళన చెందుతున్నారు. అధికారులు, నాయకులు ఇటువంటి ప్రమాదాలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కాలువలోకి దూసుకెళ్లిన కారు

ఆదివారం రావులపాలెం వైపు నుంచి వస్తున్న కారు ప్రమాదవశాత్తూ అదుపుతప్పి ప్రధాన పంట కాల్వలోకి దూసుకుపోయింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం దేవగుప్తం గ్రామానికి చెందిన పోసిన పెద్ది సాయిధీరజ్ రావులపాలెం నుంచి తమ బంధువుల ఇంటికి రాజోలు మండలం కడలి గ్రామానికి కారలో బయలుదేరాడు. ఈక్రమంలో రాజ వరం-పొదలాడ రోడ్డులో ఉడిమూడి శివారు చింతావారిపేట వద్దకు వచ్చేసరికి ప్రమాదవశాత్తూ కారు ప్రధాన పంటకాల్వలోకి దూసుకుపోయింది. దీంతో డిక్కీని ఓపెన్ చేసి బయటపడడంతో స్థానికులు ఒడ్డుకు చేర్చారు. అదే సమయంలో ప్రమాదం జరిగిన తీరును పరిశీలిస్తూ.. అటుగా వస్తున్న ద్విచక్ర వాహనదారుడిని వెనుక వస్తున్న మరో ద్విచక్ర వాహనదారుడు బలంగా ఢీకొట్టాడు. ఈ ఘటనలో వెనుక వస్తున్న వాహనదారుడు (ఏలూరు జిల్లా ఉంగుటూరు కైకరం గ్రామానికి చెందిన)కి బలమైన గాయం కావడంతో 108సాయంతో కొత్తపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. స్వల్పగాయాలతో బయటపడిన సాయి ధీరజ్ స్థానికుల సాయంతో కారును బయటకు తీశారు.

పదిరోజుల వ్యవధిలో.. రెండోది

ఒక ప్రమాదం జరిగి పదిరోజులు పూర్తి కాకుండానే కూతవేటు దూరంలో అదేమాదిరిగా మరో ప్రమాదం జరగటంతో స్థానిక ప్రజానీకంతో పాటు వాహనదారులు సైతం తీవ్రభయాందో ళనకు గురవుతున్నారు. ఈనెల 10వతేదీ తెల్ల వారుజామున జరిగిన ఘోర కారు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన తల్లి, ఇద్దరు కుమారులు మృతి చెందిన సంగతి పాఠకులకు విదితమే. ఆ సంఘట నను మరువక ముందే మరో ఘటన అదే ప్రాంతంలో చోటుచేసుకుంది. ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి రాజవరం-పొదలాడు రోడ్డులో పొదలాడ నుంచి గంటి వరకు కాలువ వైపుర క్షణగా ఇనుప రైలింగ్‌ను ఏర్పాటుచేసి ప్రమాదాలను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.